Entercel

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



మే 28, 2006

డావిన్సి కోడ్

హాలివుడ్ హడావుడి

హ్యాపీ బర్త్‌డే

28.5.2006 నుండి 3.6.2006 వరకు

సందెన భానుప్రకాశ్
మే-29
అనితారాణి - కమలాకర్
కుందారం-వరంగల్

హర్షిత్ రెడ్డి
మే-2002
హరిత - శ్రీయాత్‌రెడ్డి
నార్కెట్‌పల్లి-నల్గొండ

ఎస్. సుమంత్
మే-31
శ్రీదేవి- మోహనరావు
బి. హెచ్. పి. వి. కాలనీ-విశాఖపట్నం

చాణక్య
జూన్-2
శివపార్వతి - వీరబాబు
వల్లూరుపాలెం-తోట్లవల్లూరు మండలం

పెంద్యం నిఖిత్‌బాబు
జూన్-1
దానమ్మ - నరసింహారావు
పొదిలి-ప్రకాశం జిల్లా

పి. సాత్విక్
మే-30
సుధ - నవీన్‌కుమార్
అడ్డగుట్ట-సికింద్రాబాద్

ఎస్.పి. వైష్ణవి
మే-30
అరుణ - కృష్ణకుమార్
డోర్నకల్-వరంగల్

మండోజి తోపిక్ ఖాన్
జూన్-2
జబీనా - అరీఫ్ ఖాన్
ఓబుళదేవరచెరువు
అనంతపురం జిల్లా

కొల్లా శ్రీవల్లి
జూన్-4
ప్రమీల - నాగేందర్
ఖమ్మం

సుశీరత్ సామల
మే-1997
లలిత - వెంకటేశ్వర్లు
కరీమాబాద్‌రోడ్ - వరంగల్

ముత్యాల సుమనిక
మే-29
శ్రీలత - సుధీర్
నెల్లూరు జిల్లా

సాయి ప్రభాత్
శ్రీలత - అశోక్‌రెడ్డి

గుమ్మడి ప్రణతి
మే-29
కవిత - నర్సయ్య
బురహాన్‌పురం - ఖమ్మం

యడ్లపల్లి శ్రీవల్లి
మే 27
మాధవి - నాగేశ్వరరావు
వెంకటేశ్వరనగర్ - ఖమ్మం

ఓటమితో నిరుత్సాహ పడవద్దు...

గెలుపుతో ఉప్పొంగడం చిన్న ఎదురు దెబ్బ తగలగానే నిరుత్సాహపడడం సరైన పద్ధతి కాదు. లోపాలను సరిచేసుకుని భవిష్యత్తుకు కార్యాచరణ రూపొందించు కోవాలి. ఇబ్బందులు, ఆటంకాలు అనేవి సహజం. వాటిని అధిగమించడంద్వారా మనలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఎంత నైపుణ్యత ఉన్నా దానిని ఆచరణలో పెట్టకపోతే జీవితాలు అంధకారంగా మారుతాయి. అమెరికా సామ్రాజ్యవాదం కోరలు చాస్తుంటే అవకాశం ఉండి కూడా అనేకమంది దానిని వ్యతిరేకించడంలేదు. వ్యతిరేకించడానికి అవసరమైన నైపుణ్యత, శక్తి, యుక్తి మన దేశ ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఉంది. తమకున్న ప్రతిభను ప్రదర్శించడంలో విఫలమవుతున్నారు. అందుకు కారణం ఉత్సాహంగా ఉద్యమాల్లోకి వచ్చి చిన్న ఆటంకం ఏర్పడగానే ఇక చేసింది చాల్లే మనకెందుకు అనే నిరుత్సాహానికి గురవుతున్నారు. ఉత్సాహం, నిరుత్సాహాన్ని సమతుల్యం చేయడంద్వారా అనేక విజయాలు సాధించవచ్చని మూడున్నర దశాబ్దాలపాటు ఖమ్మం మున్సిపల్ ఛైర్మన్‌గా, సిపిఎంలో అనేక బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం తెటతెల్లం చేసింది.



మన అతిథి గురించి...

పేరు	:	చిర్రావూరి లక్ష్మీనర్సయ్య
పుట్టిన తేదీ	:	15-03-1915
వృత్తి	:	కమ్యూనిస్టు రాజకీయాలు
నచ్చిన వ్యక్తులు	:	కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు
నచ్చిన అంశం	:	బెంగాల్‌లో మళ్ళీ సిపిఎం అధికారంలోకి రావడం
బలం	:	ఆత్మవిశ్వాసం
బలహీనత	:	లోపాలను నిర్మోహమాటంగా ఎత్తిచూపడం
మర్చిపోలేని	:	తెలంగాణా సాయుధ పోరాటంలో కీలక
సంఘటన	:	పాత్ర పోషించడం
అలవాట్లు	:	అధ్యయనం
ఆశయం	:	చివరి శ్వాస విడిచేవరకూ కమ్యూనిస్టుగా ఉండడం
ఆదర్శం	:	స్టాలిన్

ఈ సంచికలో... ఇంకా...

టపా ... 2
కందుకూరి స్మృతిలో ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సూ కమాన్ సెన్సు ... 20

ఇలా వుందామా... 7
మానవారణ్యం

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
ఓ అమ్మకథ

ఆరోగ్యం ... 17
ఓ మంచి పుస్తకం ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞాన-వీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24





ప్రశ్నార్థకమే

దిక్కూమొక్కూ లేకుండా అల్లాడుతున్న అనాథబాలల గురించి - 'ప్రసూనాలు' పేరుతో మనసుకు హత్తుకునేలా రాశారు. సాధారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను గారాబంగా చూసుకుంటారు. కానీ వీధిబాలల పరిస్థితేమిటి? వీళ్ళగురించి ఎవరు పట్టించుకుంటారు? ఇది నిజంగా ప్రశ్నార్థకమే. మనకున్నదాంట్లో ఎంతోకొంత సహాయం అందించాలని ప్రస్తావించడం బాగుంది. కేవలం సానుభూతివల్ల ఒరిగేదేం వుండదు కదా మరి.

ఆర్. విశాలాక్షి, రాజమండ్రి.



ఆసక్తికరం

మొబైల్ ఫోన్లు, మొబైల్ టీవీలు, మొబైల్ డి.వి.డి. ప్లేయర్లు... ఒక్క మాటలో చెప్పాలంటే ఇది మొబైల్ యుగం' అంటూ మొదలుపెట్టి ఎన్నో సంగతులు తెలియజేసిన 'మొబైల్.. మొబైల్' కవర్‌స్టోరీ ఆసక్తికరంగా వుంది.

జి. గంగాధర్, కడప.

ప్రతినిధి

ఉల్లి సేయును మేలు' కథ సున్నితమైన హాస్య, వ్యంగ్య ధోరణిలో చక్కగా సాగింది. ఉల్లిపాయలు ఉచితంగా ఇస్తానని ఎంతో ధీమాగా వాగ్దానం చేసిన ఛైర్మన్ అంతరంగం, అతడి కుళ్ళు ఆలోచనలు నవ్విస్తూనే ఆలోచింపచేశాయి. ఎందరో రాజకీయనాయకులకు ప్రతినిధి కుక్కుటేశ్వరరావు.

చలమాల సౌదామిని,
చైతన్యపురి, హైదరాబాద్.

పంచ్

'టర్నింగ్ పాయింట్ వుందన్నావు, లెఫ్టా.. రైటా? అని చేయి చూపించుకున్న వ్యక్తి జ్యోతిష్యుడిని అడిగినట్లు, 'కవిత తిరిగొచ్చిందా? అయితే చదివి వినిపిస్తానుండు' అని ఒక కవి పోస్ట్‌మ్యాన్‌తో అనట్లు వేసిన కార్టూన్లు బాగున్నాయి. ఇలాంటి పంచ్ వున్న కార్టూన్లు మరిన్ని అందించగలరు.

కాటమనేని భాస్కరరావు, విశాఖపట్నం.

హర్షణీయం

ఇ-వ్యర్థం గురించి రాసిన 'హైటెక్ కాలుష్యం' ఎంతో ఉపయుక్తమైన ఆర్టికల్. ఇది చదివాక ఎన్నో విషయాలు తెలిశాయి. హైదరాబాద్‌ను ఐ.టి.కేంద్రంగా మారుస్తామని చెప్పుకుంటున్న నేతలు దానివల్ల వచ్చే ఇ-వ్యర్థాన్ని ఏం చేయదల్చుకున్నారో ముందే చెప్పాలని, ఇ-వ్యర్థానికి వ్యతిరేకంగా దేశంలో ఉద్యమం రావాలని రచయిత ఆశించడం హర్షణీయం.

వి. శ్రీనివాసరావు,
విజయవాడ.

అతిథి పలుకులు

దువ్వూరు భాస్కరరెడ్డిగారి అతిథి పలుకులు అక్షరసత్యాలనిపించాయి. దాదాపు అందరిలో కూడా అంకితభావం తగ్గిందన్నారు. అది నిజమే కదా. ఈ కాలం పిల్లలు స్వయంకృషిపై ఆధారపడాలని, అందుకు తగ్గ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టాలని, కులతత్వం పోవాలంటే కులాంతర, మతాంతర వివాహాలు జరగాలని చెప్తూ మంచి సందేశాన్ని అందించిన డాక్టరుగారికి కృతజ్ఞతలు అందజేయగలరు.

ఎం. రాజ్యలక్ష్మి, గుడివాడ.

మొబైల్ మొబైల్

మొబైల్ ముఖచిత్ర కథనం ద్వారా ఎన్నో కొత్త సంగతులు తెలిపాయి సద్వినియోగం అయితే ఏ టెక్నాలజీ అయినా ఆరోగ్యకరమే. క్యాంపస్ ఛాట్ చదువుతుంటే అందరికీ వారి వారి కలేజీ రోజులు గుర్తుకు రావడం ఖాయం. కాలక్షేపాన్ని అందిస్తూనే జ్ఞాపకాలలో ఓలలాడించే చక్కని శీర్షిక ఇది. కార్టూన్లు బావున్నాయి

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

అవగాహన

సలహాలు శీర్షికలో విభిన్న సమస్యలను, వాటికి తగిన పరిష్కారాలను రాస్తున్నారు. వీటివల్ల ఎన్నో లీగల్ విషయాలు తెలుసుకోడానికి, ఒక అవగాహన ఏర్పర్చుకోడానికి అవకాశం కలుగుతోంది.

ఎస్ రామకృష్ణ,
మహబూబ్‌నగర్.

ఉత్తేజం

గుమస్తాగిరి నుండి ప్రపంచ గణిత శాస్త్రవేత్తగా ఎది గిన శ్రీనివాసరామానుజం గురించి టర్నింగ్‌పాయింట్ శీర్షికలో విపులంగా రాశారు. ఇటువంటి మహనీయులు అందరికీ, అన్ని వేళలా ఆదర్శ ప్రాయులే. అందుకే వీళ్ళను స్మరించు కోవడం అవసరం. వాళ్ళ జీవితం మనకెంతో ఊరటను, ఉత్తేజాన్ని ఇస్తుంది.

కె. సంపూర్ణ,
భవానీపురం, విజయవాడ.

అవకాశం

ఒకనాటి నటి టి. కనకంగురించిన సినిమా కబుర్లు అలరించాయి. ఇష్టంలేని పెళ్ళి చేసుకోలేక పారిపోయి ఆనక నటి కావడం మొదలైన విషయాలు ఆసక్తికరంగా వున్నాయి. నటీనటుల తెరవెనుక సంగతులు తెలుసుకునే అవకాశం కల్పిస్తోన్న స్నేహకు అభినందనలు.

వల్లభరావు గుడిపాటి, తెనాలి.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3727

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

కందుకూరి స్మృతిలో...

మే 28,

కందుకూరి వీరేశలింగం

గారి వర్థంతి. వందేళ్ళ క్రితమే ఆయన మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఏం లాభం, ఇప్పటికీ అవలాగే ఉన్నాయి. ఈ సందర్భంగా ఆ మహనీయుణ్ణి స్మరించుకుంటూ కొన్ని వ్యంగ్యాస్త్రాలు...









...అందులో మాకెంత రావాలి?



మాది ఖమ్మం జిల్లా భద్రాచలం. నాకు ఏడు సంవత్సరాల వయసున్నపుడు మా అమ్మ చనిపోయింది. అమ్మకు మేం ముగ్గురు పిల్లలం (అక్క, అన్నయ్య, నేను). అక్కకి పెళ్లయింది. అన్నయ్యకు పోలియో వచ్చింది. అమాయకుడు కూడా. నాకు పెళ్ళయింది, వేరే ఉంటున్నాను. ఇంట్లో గొడవల కారణంగా పెళ్ళికి ముందునుంచే వేరే ఉంటున్నాను. మా నాన్నగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఆవిడ మా సొంత పిన్ని (అమ్మకి చెల్లెలు). పిన్నికి ఇద్దరు ఆడపిల్లలు. వాళ్లకింకా పెళ్ళి కాలేదు. నాన్నగారు రిటైర్ అయ్యారు. ఐదు లక్షలొచ్చాయి. అందులో మా ముగ్గురికి 3 పదులు ముప్పైవేలు ఇస్తానంటున్నారు. న్యాయంగా అయితే మాకు ఎంతెంత ఇవ్వాలి. దానికి మేమేం చేయాలో, ఎవరిని సంప్రదించాలో తెలుపగలరు

టి. రాము,

భద్రాచలం, ఖమ్మం జిల్లా.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

మీ నాన్నగారి రిటైర్‌మెంట్ డబ్బు విషయంలో పెళ్ళయిన మీకు ఎటువంటి హక్కులేదు. పెళ్ళి కాకుండా ఉండుంటే మెయింటెనెన్స్ కింద పెళ్ళి ఖర్చు కింద కోర్టులో దావావేసి డబ్బు పొందే అవకాశం ఉండేది. పెళ్ళయిన పిల్లలకు ఇవ్వవలసిన పనిలేదు. మీ అన్నయ్యకు పోలియో అన్నారు. అతడు బలహీనుడు కనుక తన బ్రతుకు పోషణకోసం డబ్బు అడిగే హక్కు ఉంటుంది. సామరస్యంగా ఒప్పుకుంటే సరి లేదంటే కోర్టుకు పరిస్థితి వివరిస్తూ రాసి, నోటీసు ఇప్పించవలసి ఉంటుంది.

డబ్బివ్వకుండానే ఇచ్చానంటున్నాడు...

ముల్కలపల్లిలో మా నాన్నగారి పేర రెండున్నర ఎకరాల పొలం ఉంది. దాన్ని అప్పులకింద ఒకతనికి 1997లో లక్షరూపాయలకి అమ్మాం. బయానగా 20వేలు ఇచ్చి కాగితం తీసుకున్నాడు. తతిమ్మా డబ్బులకు సంవత్సరం వాయిదా అడిగాడు. సంవత్సరమైన తర్వాత డబ్బులు అడిగితే పంటలు లేవన్నాడు. అప్పుడు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా రూపాయి వడ్డీ చొప్పున 80వేలకు కాగితం రాయించి, పొలం అతన్ని దున్నుకోమన్నారు. పొలం అతను సాగుచేసుకుంటున్నాడు. కానీ డబ్బులు మాత్రం అప్పుడు పదివేలు ఇప్పుడు 10వేలు చొప్పున ఇవ్వసాగాడు. 2006 వరకు 50 వేలు ముట్టినవి. కానీ అతడు మొత్తం డబ్బులు ఇచ్చేశాననీ, తన పేరున రిజిష్టరు చేయించాలని దబాయిస్తున్నాడు. పెద్దమనుషులు ఎవరూ మాట్లాడడం లేదు. ఇచ్చినట్టుగా కాగితాలు కూడా లేవు. దయచేసి అతనివద్ద తక్కిన డబ్బు రాబట్టే మార్గం చెప్పండి.

ఎం వెంకటయ్య, హైదరాబాద్

మీరు అతడికి రాసిచ్చిన కాగితంలో ఆస్తి అతడి ఆధీనం చేసినట్టు చూపారా? ఇచ్చిన గడువులో డబ్బులు ఇవ్వకుంటే కాగితం చెల్లదని రాశారా? ఆయన 80 వేలకు అప్పుగా మీకు రాసిచ్చిన కాగితం వుండి, అతడివద్ద ఇంకా ఏమైనా ఆధారాలు లేనట్లయితే మీరు నోటీసు ఇచ్చి అతడినుంచి భూమి రికవరికోసం దావా వేయవచ్చు. లేదా డబ్బులకోసం వేసుకోవచ్చు. అలా దావా వేయడంతో పరిస్థితి చక్కబడవచ్చు.

ఇంటి సంగతులు

ఆడాళ్ళకివి చాలండీ!

ఇంద్రగంటి జానకీబాల

వాళ్ళు నలుగురూ ఇంట్లోకి వస్తూనే "మీ టైం కొంచెం తినడానికొచ్చాం'' అంటూ సోఫాలో సర్దుకున్నారు. ఉన్నమాట చెప్పారు కనుక నేనేం మాట్లాడలేక నవ్వి ఊరుకున్నాను. ఒక టీవీ ఛానల్లో ఓ అరగంట సమయాన్ని మహిళల కార్యక్రమాలతో నింపాలి. అదీ వాళ్ళ సమస్య. అయితే వాళ్ళకదేం పెద్ద సమస్య కాదు. వాళ్ళకి తెలిసున్నంతవరకూ విషయాలు రాసుకొచ్చారు. ఇంకా ఏమైనా కావాలా, లేక వున్నవి తీసేయాలా - అనే చిన్నచిన్న సందేహాలు... అంతే.

ఒకమ్మాయి మొత్తం వివరించి "అసలు ఆడవాళ్ళకి ఏం చెప్పొచ్చు టీవీలో?" అంది నవ్వుతూ నావంక చూస్తూ.

పక్కనున్న పడుచు కుర్రాడు వెంటనే అందుకుని "ఏముందాంటీ... నే చెప్తాను" అని ఒక్కొక్క వేలూ ముడుస్తూ చెప్పడం మొదలుపెట్టాడు.

"... ముందుగా చీరలగురించి. అంటే కొత్త చీరలు, రకాలు, మ్యాచింగులు, ఫాల్ కుట్టించడమెలా? అంచులకు కుచ్చులు వుండాలా, వద్దా? ఒకవేళ వుంటే ఎలాంటి సమస్యలొస్తాయి? చీరలకు గంజిపెట్టడం ఎలా? ముడతలు రాకుండా ఆరేయడం ఎలా? ఒకసారి ఇస్త్రీచేసిన చీర ఎన్నిసార్లు కట్టచ్చు? ఇస్త్రీచేసిన చీరమీద ఇస్త్రీలేని బౌజు వేసుకుంటే చీరకుండే అందం పోతుందా లేదా? జాకెట్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?..'' అని అతను చెప్తోంటే "ఏంటీ..." అన్నాను.

"కాదా ఆంటీ, అన్ని టీవీల్లోనూ స్త్రీల కార్యక్రమాల సారం ఇంతే కదా" అని చప్పరించాడు.

క్షణమాగి "ఇక వంటల గురించి చెప్తే ఆడవాళ్ళకి మహా ఇష్టం. అందమైన గాజుగిన్నెల్లో కొంచెం కొంచెం పదార్థాలు పోసి, చూపిస్తూ వాళ్ళకి తెలిసిన అతి సాధారణమైన వంటకమైనా సరే చెప్తే చాలు టీవీముందునుంచి కదలకుండా చూస్తారు.

ఉల్లి తరుగు - కారం - జీలకర్ర - తగినంత ఉప్పు - 3 చెంచాల నూనె - వెన్న - అల్లం వెల్లుల్లి పేస్టు... అంటూ పెద్ద జాబితా చెప్పి, చివరికి చేసేది చిరపరిచితమైన వంటకమే అయినా పెద్దగా బాధపడరు. ఆఖరికి వంకాయ పచ్చడి, మజ్జిగచారు లాంటి నిత్యం చేసుకునే వంటకాలైనా సరే కళ్ళార్పకుండా చూస్తారు'' అని ఆ అబ్బాయి అనర్గళంగా మాట్లాడ్తోంటే "ఆడవాళ్ళకి వంట తప్ప మరో లోకంలేదా?'' అన్నాను కోపాన్ని నిగ్రహించుకుంటూ.

"తప్పండీ.. తినే పదార్థాల గురించి లోకువగా మాట్లాడకూడదంటారు. అదలా వుంచి ఆ వంటల్లోంచి ఒక ప్రశ్న వేసి, జవాబు రాసినవారికి బహుమతి ప్రకటిస్తే ఆడవాళ్ళకి చాలా ఉత్సాహంగా వుంటుంది. కాదా మీరే చెప్పండి'' అంటూ కళ్ళెగరేశాడు.

అదంతా పెద్ద గందరగోళంగా వుంది. ఏం మాట్లాడాలన్పించక మౌనంగా వుండిపోయాను.

"ఇకపోతే ముచ్చటగా మూడో విషయం బంగారం. ఇప్పుడు బంగారం ధర ఆకాశాన్ని అంటుకుంటోంది. అందువల్ల ఆడవాళ్ళకి బంగారు ఆభరణాలమీద మోజు కూడా ఆకాశమార్గంలో ప్రయాణిస్తోంది.

డబ్బుందా లేదా అనే విషయం పక్కనపెట్టి అసలు సరుకు ఇంటికొచ్చే మార్గం గురించి ఆలోచిస్తున్నారు. డబ్బు చేతిలో వుంటే చెల్లిస్తున్నారు. లేనివాళ్ళు అప్పుచేసి మరీ కొంటున్నారు. అందుచేత బంగారం వచ్చే సులభమైన మార్గం టీవీ కార్యక్రమంలో చూపిస్తే అందరూ టీవీకి అతుక్కుపోయి కూర్చుంటారు. సెంట్ పర్సెంట్ గ్యారంటీ. బంగారం గెలుచుకోడానికి చాలా సులభమైన ప్రశ్నలు వెయ్యాలి. ఎవరైనా ఠపీమని జవాబు చెప్పేట్లుండాలి.

సపోజ్.. 'నీళ్ళను ఇంగ్లీషులో ఏమంటారు?' అనడిగితే వాళ్ళు వెంటనే 'వాటర్' అంటారు. 'వెరీ గుడ్' అంటూ అభినందించి ఒక బంగారు కాసు ఇవ్వాలి. ఇంక వాళ్ళ ఆనందానికి అవధులుండవు..."

అంతవరకూ సహించిన నాకు తెగ చిరాకు పుట్టుకొచ్చి "అసలు మీ ఉద్దేశమేంటి? ఆడాళ్ళంటే ఎంతసేపూ చీరలు, నగలు, వంటలు అంటూ చెప్తున్నారు. అంతకుమించి స్త్రీలు కోరుకునేది ఇంకేం వుండదా?" అనడిగాను.

"ఆడవాళ్ళకేం కావాలండీ? టైం పాస్ అంతే. కుట్లు, అల్లికలు, నోములు, వ్రతాలు లాంటి కార్యక్రమాల చివర 'ఎవరు ఎన్ని మిరపకాయ బజ్జీలు తింటారు? నిమ్మకాయను ముక్కుతో తోసుకుంటూ బల్ల చివరికి తేగలరా? కొవ్వొత్తిని వెలిగించి, ఆర్పి.. నిమిషానికి ఎన్నిసార్లు అలా చేయగలరు?' లాంటి స్పోర్టివ్ ఐటమ్స్ పెడితే ఆడవాళ్ళు చాలా ఉత్సాహంగా టీవీ ముందునుంచి లేవరు..."

ఈ వరసన ఆ నలుగురూ దడదడా చెప్పేస్తుంటే నాకేం చెప్పాలో అర్థంకాలేదు. నోరెండిపోయింది. చివరికి "అంటే ఆడవాళ్ళకి ఒక్క విషయం కూడా విజ్ఞానదాయకమైంది అవసరం లేదంటారా?" అన్నాను.

"ఆ.. విజ్ఞానం అవీ మగాళ్ళకి. ఆడవాళ్ళకి కాలక్షేపం ముఖ్యం కదండీ. వాళ్ళు ఇంట్లో పనులన్నీ ముగించుకుని మళ్ళీ పనుల్లో పడటానికి మధ్యలో వుండే సమయంలో కాస్తంత రిలాక్సేషన్.. అంతే.

పుస్తకం చదవడం - ఆలోచన - స్వేచ్ఛ - ఆర్థిక స్వాతంత్ర్యం లాంటి విషయాలు టీవీలో స్త్రీల కార్యక్రమాలకు అనవసరమండీ. నా అభిప్రాయం ప్రకారం ఆడాళ్ళకివి చాలండీ" అన్నాడతను.

"మరి నా దగ్గరికెందుకొచ్చారు?'' అన్నాను ఉక్రోషంగా.

"మిమ్మల్నీ కలిశామని చెప్పడానికి" అన్నదా అమ్మాయి అమాయకంగా.

*

ఇలా వుందామా...

సమీర్‌చక్రవర్తి

మానవారణ్యం

వంటింట్లో పని చేసుకుంటున్న కాంతమ్మకు హాల్లోకి ఎవరో వచ్చిన అలికిడయ్యింది. వని చేసుకుంటూనే "ఎవరూ?" అందామె.

"నేనే" అన్నాడు కాంతమ్మ భర్త గోపాలరావు.



వచ్చింది భర్తేనని తెలిశాక "మంచినీళ్లు తెమ్మంటారా?" అనడిగింది.

"ఆ..." అన్నాడాయన.

మంచినీళ్ల గ్లాసుతో హాల్లోకొచ్చిన కాంతమ్మకు పడకకుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తూ కన్పించాడు గోపాల్‌రావు. కళ్లుమూసుకుని, ఒకచేత్తో తలపట్టుకుని కూర్చున్న ఆయన్ను చూడగానే భర్తెందుకో దిగులు పడ్తున్నట్లు గ్రహించి "ఏమండీ..! మంచినీళ్ళు" అంది కాంతమ్మ.

తలపట్టుకున్న చేతినలానే ఉంచి కళ్ళు మాత్రం తెరిచాడు. ఆయన కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. అదిచూసి "ఏమైందండీ?" గాభరాగా అడిగిందామె.

ఆయన కళ్ళు తుడుచుకుంటూ "ఏమీలేదు" అన్నాడు ముక్తసరిగా. మంచినీళ్ళు తాగాక "ఏమైంది, నాతో చెప్పకూడదా?" అంది కాంతమ్మ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"నేను ముందే చెప్పాను. ఈ మహానగరంలో ఉండలేమని, చక్కగా మనూరిలోనే ఉండిపోదామని. నువ్వే.. ఒక్కగానొక్క కొడుకును విడిచి ఉంటామా అంటూ ఈ మానవారణ్యంలోకి తీసుకొచ్చి పడేశావు" అన్నాడాయన దు:ఖాన్ని గొంతులోనే దిగమింగుకుంటూ.

"సర్లేండి! మీకిక్కడ ఇంత ఇబ్బందిగా ఉంటే ఊరికి వెళ్దాం. సరేనా!" అంటూ ఆయన్ను శాంతింపజేసే ప్రయత్నం చేసిందామె.

"ఇక్కడుంటే నాకు మనుషుల మధ్యనున్నానో యంత్రాల మధ్యనున్నానో అర్థంకావట్లేదు" అన్నాడాయన.

"అసలేంజరిగిందో చెప్పండి ముందు" అనడిగిందామె.

"నేను చెకప్‌కోసమని హాస్పిటల్‌కు వెళ్ళానా.. డాక్టరింకా రాలేదు, రావడానికి కొంచెం టైం పడ్తుందన్నారు. నీకు తెలుసుకదా హాస్పిటల్ రెండో అంతస్తులో ఉందని. పిట్టగోడదగ్గరకొచ్చి కింద వచ్చీపోయే వాహనాలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను. అప్పుడు రోడ్డుపైన జరిగిందో పెద్దప్రమాదం. ఓ తల్లీ కొడుకులు స్కూటర్‌పై ప్రయాణిస్తున్నారు. తల్లి వయసు సుమారు నలభై ఉంటుంది. కుర్రాడి వయసు పదిహేడో, పద్దెనిమిదో ఉండొచ్చు.. వాళ్ల స్కూటర్‌ను వెనుక నుండి వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. స్కూటర్ డ్రైవ్ చేస్తున్న కొడుకెళ్లి దూరంగా పడ్డాడు. బస్సు ఢీకొట్టిన స్థలంలోనే పడిపోయిన తల్లిమీద నుండి బస్సు వెనక చక్రాలు వెళ్లాయి. ఆమె గిలాగిలా కొట్టుకుంటోంది. రక్తం ఏరయ్యింది. ఇంత పెద్ద ప్రమాదానికి కారణమైన బస్ డ్రైవర్ బస్సాపి వెనక్కి తిరిగి చూడలేదు సరికదా మరింత వేగంగా వెళ్లిపోయాడు. చుట్టూ జనం మూగారు. 'అయ్యో పాపం' అంటున్నారేగాని ఎవరూ సహాయం చేయడానికి ముందుకెళ్లలేదు. పోలీసుకేసయి ఎక్కడ తంటాలొస్తాయోనన్న భయమే అందరిలోనూ. కాళ్లు విరిగాయో ఏమో.. ఆ కుర్రాడు లేచినిలబడ లేకపోయాడు. అంతబాధలోనూ అతడు "ప్లీజ్ మా అమ్మను కాపాడండి... ప్లీజ్ కాపాడండి" అని భోరున ఏడుస్తూ కేకలు పెట్టాడు. ఎవరూ చలించలేదు. పైనుండి ఇదంతా చూస్తున్న నేను ఉండబట్టలేకపోయాను. హాస్పిటల్లో ఉన్న నర్సుని పిలిచి 'ఆమెకు ఫస్ట్ ఎయిడ్ చేద్దువుగాని పదా' అన్నాను. 'బాబోయ్! నేను రాను. అది చిన్న వ్యవహారం కాదు' అని మొరాయించింది. నాకు పిచ్చ కోపమొచ్చింది. కాని ఏమనలేక 'దయచేసి దగ్గరలోనున్న పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌చెయ్య'మని ఆమెను ప్రాధేయపడ్డాను. మొత్తంమీద ఆమె పోలీసులకు ఫోన్‌చేసింది. పోలీసులొచ్చారు. అప్పటి వరకు గిలాగిలా కొట్టుకుంటున్న ఆ తల్లిలో వారొచ్చి చూసే సమయానికి చలనం లేదు. ఆపాటికే ఆమె చనిపోయింది..." అని ఏకబిగిన విషయమంతా చెప్పి చిన్నపిల్లాడిలా కళ్లనీళ్లు పెట్టుకున్నాడు గోపాలరావు.

"ఊరుకోండి..ఊరుకోండి.. మీరు చెయ్యగలిగింది చేశారు" అంటూ ఓదార్చింది కాంతమ్మ.

"మనం మనుషులమా? యంత్రాలమా? చుట్టూ జరుగుతున్నవాటితో మనకు సంబంధం లేదా? నాకు ఆశ్చర్యమేసిన మరో విషయమేమిటంటే ప్రమాదానికి కారణమైన బస్సులో ఉన్న ప్యాసింజర్లైనా డ్రైవరును బస్సాపమని నిలదీయకపోవడం. ఛీ..ఛీ.. ఇక్కడుండడం నావల్ల కాదు. ఇలా ఉండడం నావల్ల కాదు" అన్నాడు గోపాలరావు, బాధ, కోపం కలగలసిన స్వరంతో.

✻

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(ముఠామేస్త్రి సుందరం కూలిపనికి వెళ్తే తమకు ఎక్కువ డబ్బు వస్తోందని, పటేలు కూడా ఆమాత్రం కూలిపైకం ఇస్తే తప్పు పైరు కోతలకు రామని నిక్కచ్చిగా చెప్తాడు)

(19 వ భాగం)

"ఎకరానికి ముప్పయి మానికలు కొలిపించండి. మీకున్న ఇరవై ఎకరాలకు లెక్కగట్టి ధాన్యం ఇప్పించండి చాలు"

"మాకు వెట్టి కింద ఏటా కొంత పొలం తీసివేస్తున్నారు గదరా. అదేమీ ఉండదూ?"

అప్పటివరకూ సుందరం పక్కనే నిల్చున్న అబ్బురాం కలిగించుకుని "ఈ సంవత్సరం తీసివేతలు కోసివేతలు ఏమీ ఉండవండీ" అన్నాడు.

"ఈ సంవత్సరం ప్రత్యేకతేమిటోయ్. పగలు చుక్కలేమైనా పొడిచినయా ఏమిటి?" అని వెటకారంగా నవ్వాడు.

అబ్బురాం కూడా వెటకారంగానే నవ్వాడు. "ఈ మాత్రం దానికి పగటి చుక్కలెందుకండి? తోకచుక్క పొడిచింది చాలదూ?" అన్నాడు.

పటేలు మండిపడ్డాడు. "ఒరేయ్ వేళాకోళాలు ఆడడానికి బావమరిదిని కాదు" అని గద్దించాడు.

అక్కడేఉండి ఇంతసేపు ఆ సంభాషణ వింటున్న పెద్దమాదిగ పెంటయ్య కలిగించుకున్నాడు. "చిన్న పోరగాళ్లు తెలిసికొంత, తెలియక కొంత వాగుతున్నారు సెమించండి" అన్నాడు. వాడు యువకులనుద్దేశించి "పెద్ద దొరలతో మీకు అవహేళనం ఎందుకురా? మాటతీరుగా మాట్లాడుకోరాదూ?" అన్నాడు.

"అదేంటి పెంటయ్య మావా? నువ్వు మమ్మల్నే అంటున్నావు? కూలీరేటు నిక్కచ్చిగా అడుగుతూంటే పగటి చుక్కలు పొడిచినాయా అని వారే అవహేళనం చేస్తుండిరి గదా?"

"వాళ్ళు గేమానికంతటికీ కామందులు, వారితోపాటు మీరూ..... యదవల్లారా చిన్నాపెద్దా లేకుండానా?" అన్నాడు తిరిగి పెంటయ్య.

ఆమాటలకు అబ్బురాం, మిగతావారందరూ చురచురలాడుతూ చూశారు పెంటయ్యను.

"ఏహే పదండిరా కోపు కొట్టుడుకు పొద్దెక్కుతోంది" అన్నాడు అబ్బురాం. అతడి మాటలతో అందరూ అక్కడినుంచి కదిలారు. వెళ్తున్న వారివైపుకు పటేలు తీవ్రంగా చూస్తూ నిలబడ్డాడు. నాలుగు క్షణాలు గడిచిపోయాయి.

అప్పటివరకు పటేలు పక్కనే నిలబడిఉన్న రూబేను "ఇంకా నిలబడి ఉండడమెందుకు దొరా? తమర్ని అక్కడిదాకా పంపిస్తాను పదండి" అన్నాడు.

అతడి మాటలతో పటేలు తలూపుతూ ముందుకు కదిలాడు. ఆయనవెంట రూబేను నడిచాడు. ఇద్దరూ వాడదాటి వెలుపలికొచ్చారు.

"దొరా నాపైన కోపగించుకోకండి. లోగడ తమరు కబురంపగానే క్షణాలమీద ముఠాను వెంటేసుకుని రాలేదూ? పిల్లనాయాళ్ల మూలాన ఇదంతా వచ్చింది" అన్నాడు రూబేను.

"ముఠామేస్త్రిగా లేకుండా నిన్నేందుకని తీసిపారేశార్రా?" అన్నాడు పటేలు.

"అదంతా చాలా పెద్ద కతలే దొరా, నన్ను తీసిపారేయాలని చానా రోజులనుండి అనుకుంటున్నారు. ఇంతకూ మీకు చేసే ఎట్టిని ఎగ్గొట్టాలనే ఉద్దేశంతోనే నన్ను తీసేశారు"

పటేలు తలూపాడు. "వీళ్లకీ బుద్ధిని పుట్టించింది ఎవరయి ఉంటార్రా?" అనడిగాడు.

"కోదండయ్యగారి అల్లుడు పెతాపయ్య లేడూ.. ఆయనే ఇదంతా చేశాడని నా అనుమానం దొరా. ఆయన ప్రతిరోజూ వాడకొచ్చి కుర్రకారు వాళ్లందర్నీ కూడబెట్టి చానాసేపు మాట్లాడపోతుంటాడు"

"అయితే వాడజనం కూడా సంగంలో చేరారని తేల్తోంది"



"నిజమే దొరా, ఆ మద్దెన నన్ను కూడా సంగంలో చేరమని అడిగారు. కానీ అప్పుడు నేను ఆళ్లకు బాగానే జవాబు చెప్పానులెండి, పటేలు గారి నడిగి ఆరుచేరమంటే చేర్తానని చెప్పాను. అంతటితో నన్ను పలకరించటమే మానేశారు"

"బాగా జవాబు చెప్పావురా రూబేనూ, నువ్విట్టాగే నిలబడు. ఈ యదవనాయాళ్లందరి అంతు చూస్తాను"

"నిలబడి ఉండక మిమ్మల్ని వదుల్తానా దొరా? మీ పాదాల కింద బతికిన బానిసోణ్ణి"

తలూపాడు పటేలు "సరేలేరా ఇకనుండు. నేను వెళ్తాను. కానీ వాళ్లను కాస్త కనిపెట్టి ఉండు. ఏదైనా తెలిస్తే అప్పటికప్పుడు వచ్చి నాతో చెప్పిపోవాలి" అన్నాడు.

"తెలిస్తే ఊరుకుంటానా? క్షణంలో వచ్చి మీ చెవిన వేసిపోనూ?" అన్నాడు రూబేను.

తర్వాత పటేలు ఊరివైపుకు, రూబేను వాడవైపుకు నడిచారు.

★ ★ ★

పటేలు వాడనుండి ఇంటికిరాగానే గ్రామ రైతులందరినీ పిలిపించాడు. ఒక్క కోదండరాంరెడ్డి మినహా మిగతావారందరూ వచ్చారు. ఇంటిముందు వరండానిండా కూర్చున్నారు.

పటేలు అందరికీ తలా ఒక పొగాకు తుంచిచ్చాడు. కొరకాసు ఒకటి బయటికి తెప్పించి అందరినీ "చుట్టలు కాల్చుకోండి" అంటూ మర్యాద చేశాడు. కాని ఎన్నడూ చూపని అతడి మర్యాదకు అందరూ లోలోపల విస్తుపోయారు. పైకి మాత్రం అందరూ పొగచుట్టలు బనాయించి ఆ ప్రదేశమంతా పొగమబ్బులమయం చేశారు.

తర్వాత నెమ్మదిగా పటేలు సంభాషణ ప్రారంభించాడు. అతడు కూలివాడ వెళ్లడం, అతడికీ, కూలీలకూమధ్య జరిగిన మాటలన్నీ చెప్పాడు. చివరికి "ఇలా ఉంది మన గ్రామ పరిస్థితి. సంగాలంటూ బయల్దేరి ఈ మహావీరులందరూ కలిసి చేసిన పనులివయ్యా" అన్నాడు.

రైతులంతా తలలూపారు. కాని పటేలు బావమరిది జానకిరాంరెడ్డి మాత్రం "కూలీలు అంతవరకూ వచ్చారా?" అన్నాడు.

పటేలు తలూపి "అంతవరకూ వచ్చారనుకోవడంలో ఆశ్చర్యం ఏమిటి? వెనుకటి భయభక్తులన్నీ పోయినయ్. సంగాలంటూ వచ్చి ఇన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టినయ్. మా భవంతి కట్టే రోజుల్లో ఈ సుందరిగాడి తండ్రి పెంటిగాడు మాకు కూలికొచ్చేవాడు. షావుకారు సుబ్బయ్య ఇంట్లో వున్న పొట్టిసోలతో రెండున్నర సోలల ధాన్యం ఇచ్చేవాణ్ణి. దానికేవాడు పొద్దుగూకులూ ఎముకలిరిగేట్టు చేయుడమే కాకుండా వేం ఇంకెవరినైనా పిల్చుకుంటామేమోనని తొలికోడి కూయకముందే వచ్చి అందరినీ లేపి పనిలో ప్రవేశించేవాడు. కానీ, ఆ రోజులు వేరు. ఆ కాలంవేరు. ఇప్పుడు కరాసోలతో మూడు సోలలనిండా ఇస్తున్నాం గదా? ఇంకా కూలిరేటు పెరగాలని వాళ్లు బిర్రబిగిసి కూర్చోడం ఏమిటీ? వీళ్ల ఆటలు ఇట్లా ఎన్నిరోజులని సాగనిద్దాం? మొన్న మట్టసవానికి ఆ చాకలి వెధవ మా ఇంట్లో బట్టలుతుక్కుండా మురగేశాడు. అది నా సొంత విషయంకాబట్టి మిమ్మల్నందర్నీ పిలిపించి చెప్పవలసిన అవసరం లేకపోయింది. వాడి అంతు ఏదో నేనే తేల్చుకుంటాను. కాని ఈ వ్యవహారం గ్రామమందరిదీ కనుకనే మీ అందరినీ పిలిపించాను. మనమందరమూ కలిసికట్టుగా ఒకమాట అనుకుని కూలీలకేమాత్రమూ సందు ఇవ్వకుండా ఉండాలనేదే నా అభిప్రాయం. దీనికి మీరందరూ ఏం చెప్తారో చెప్పండి" అన్నాడు.

అందరూ ఒకరి మొగాలు ఒకరు చూసుకున్నారు. చిన్నకారు రైతులెవరూ నోరు విప్పలేదు.

జానకిరాంరెడ్డి కలిగించుకుని "నీవు చెప్పింది బాగానేఉంది బావయ్యా. కూలీలంతా ఒక కట్టుకట్టి కూలిరేటు పెంచాలి అంటున్నారు. కాబట్టి మనందరం ఆలోచించుకుని కట్టుగా నిలబడడమే మంచిది" అన్నాడు.

ఇంతలో బ్రహ్మారెడ్డి "ఆ.. ఏదో ఒక విధంగా పోనిద్దురూ. కూటికిలేని వాళ్లమీద మనకు పందెం ఏమిటి? ఎప్పటికైనా వాళ్లు వేయక తప్పదు. మనం వేయించుకోక తప్పదు" అన్నాడు.

"వాళ్లే వేయాలని ఎక్కడుంది? ఈ సంవత్సరం పొరుగూరి కూలీలను పిలిపిద్దాం" అన్నాడు పటేలు.

"పొరుగూరి కూలీలు మాత్రం ఊరికేవస్తారా?" అన్నాడు బ్రహ్మారెడ్డి.

దాంతో అంతసేపూ మౌనంగా ఉన్న మిగతారైతులందరూ కలిగించుకున్నారు.

"ఎట్లాగూ పొరుగూరివాళ్లకు హెచ్చురేటు ఇవ్వవలసిందేగదా?" అన్నాడు పెద్దిరెడ్డి.

"ఎవరికో ఇచ్చేది మన గ్రామం వాళ్లకిస్తేనే బాగుంటుంది" అన్నాడు చెన్నారెడ్డి.

"కాస్తో కూస్తో రేటు పెంచి మన గ్రామం వాళ్లతో వేయించుకోవడమే మంచిది" అన్నాడు పుల్లారెడ్డి.

జానకిరాంరెడ్డి పటేలువైపుకు వారగా చూశాడు. "విన్నారా బావయ్యా వాళ్ల మాటలు ఎట్లా నడుస్తున్నాయో" అన్నాడు.

పటేలు తలూపి "ఇదేనోయి మనలోఉన్న పుండు. ఒకడవునంటే ఒకడు కాదనడం. అందుక్కాదూ వాళ్లట్లా నెత్తికెక్కి కూర్చోవడం?" అన్నాడు.

"బాగా ఆలోచించండి పటేలుగారూ, వాళ్లు మనగ్రామం పుట్టిన నాటినుండి మనకింద బతుకుతున్నవాళ్లు. మన సొమ్ము గిద్దెడు ఎక్కువతిన్నా పర్లేదు" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"నిజమే పొరుగూరి కూలీలను పిలిపించడం ఏమంత సబబుగా లేదు" అన్నాడు పెద్దిరెడ్డి.

"ఛీ, ఛీ మనకంటే కూటికి లేనివాళ్లే నయం. ఒక్కడి మాటకు అందరూ కట్టుకట్టి నీతిగా నిలబడ్డారు. ఆమాత్రం నీతీనిజాయితీ మనలో లేకుండా పోయాయి" అన్నాడు జానకిరాంరెడ్డి.

"ఏమయ్యో జానకయ్యా, నువ్వేంటో మహాలావుగా నీతీజాతులనెంచుతున్నావు?" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"బాగ్గెమంతులు గదూ ఏ మాటలన్నా సరిపోద్ది" అన్నాడు చెన్నారెడ్డి.



"ఆయనకు బాగ్గెముంటే ఎవరికి మేత? ఆయనే తింటాడు" అన్నాడు బ్రహ్మారెడ్డి.

వారి మాటలకు పటేలు లోలోపల మండిపోతున్నాడు. అనలు పథకం చెడిపోతుందేమోనని పైకి సర్దుబాటుగా మాట్లాడాడు. "ఏదో తెలివితక్కువగా అన్నాడు పోనీలే బ్రహ్మయ్యా"

"తెలివి తక్కువేమీ కాదు. ఆయన అన్నీ తెలిసే మాట్లాడుతున్నాడు" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"సరేలే ఇక దాన్ని వదిలేయి. ఇప్పుడసలు విషయం తేల్చుకోవడం మంచిదికదా?" అన్నాడు పటేలు.

"ఇంకా తేల్చేదేముంది? హెచ్చురేటు ఇచ్చయినా సరే పొరుగూరి కూలీలతోనే వేయించాలంటున్నారు గదా" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"అవును మన గ్రామంవాళ్లు లొంగివచ్చేదాకా పొరుగూరి కూలీలతోనే మన వేతలు కోతలు చూసుకోవాలి. కానీ దానికి మీరంతా నిలబడాలికదా?"

"మాదేమిటి లెద్దురూ? ఊకూడిస్తే ఎంత? తవడు పొలిస్తే ఎంత?" అన్నాడు బ్రహ్మారెడ్డి.

అతడితో ఇక వాదించినా లాభంలేదని అనుకున్నాడు పటేలు. పెద్దిరెడ్డివైపుకు చూస్తూ "నీ అభిప్రాయమేమిటో చెప్పవోయి పెద్దయ్యా?" అనడిగాడు. పెద్దిరెడ్డి కాసేపు లోలోపల తొక్కిసలాడాడు. చివరికి "ఉన్నూరి కూలీలతో వేయించుకోవడమే సబబు" అన్నాడు.

అతడి మాటలను మిగతావారంతా సమర్థించారు.

"ఎందుకు బావయ్యా అంతగా పొలుమాలుతావు? నీళ్లు నీళ్లవంకే పారుతాయిగాని మరోవంకకు పారుతాయా? అబ్బాయి కూలీల తరపున ఉంటే, అయ్య మన తరపున ఉంటాడా ఏమిటి?" అన్నాడు జానకిరాంరెడ్డి.

ఆ మాటలకు పెద్దిరెడ్డి ఉలిక్కిపడ్డాడు. ఇక అక్కడుండడం మంచిది కాదని తలచాడు. నెమ్మదిగా లేచాడు. అతడు లేచేసరికి అందరూ లేచి నిలుచున్నారు.

"ఏమిటోయ్ అందరూ లేచారు?" అన్నాడు పటేలు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

"శిశిరం కోసం ఎదురుచూడకు..."

అమృత

సమ్మర్ హాలిడేస్ కావడంతో కళకళలాడే క్యాంపస్ బోసిపోయింది. ఎంఫిల్ చేసే వాళ్ళు, మరికొద్దిమంది స్టూడెంట్స్ మినహా ఎవ్వరూ లేరు. అక్కడ ఉన్నవాళ్ళు కూడా తమ ప్రాజెక్టు వర్కులో తలమునకలవుతున్నారు. అయితే కొంతమంది స్టూడెంట్స్ మాత్రం యూనివర్సిటీ క్యాంపస్ వదల్లేకపోవటానికి ప్రధాన కారణం హాస్టల్ రూమ్స్-అని వాళ్ళు చెప్పారు. ఆ చిన్ని రూమ్ వాళ్ళకు స్వర్గమట! ఆ రూమ్ పరిధిలో వాళ్ళ స్వేచ్ఛకు ఎటువంటి ఆంక్షలు ఉండకపోవటమే దీనికి ప్రధాన కారణం!! అక్కడి వాళ్ళను చూశాక ఇది నిజమనిపించింది.



నమ్మకం లేకపోతే మీరే చూడండి...

ఓ రూమ్ తలుపుకు "వెల్‌కమ్ టు మై వరల్డ్" అని రాసిఉన్న స్టిక్కర్ అతికించి ఉండటంతో డోర్ నాక్ చేస్తే తలుపు తెరుచుకుంది. నీట్‌గా డ్రస్ చేసుకున్న అతను ఎక్కడికో వెళ్ళబోతున్నట్టుగా ఉన్నాడు. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. తన పేరు రాకేష్ అని చెప్పి లోపలికి ఆహ్వానించాడు. రూమ్‌లోకి వెళితే బూజులు వేలాడుతున్నాయి.

"ఏంటి ఇదంతా..." అని అడిగితే, సమాధానం చెప్పకుండా కిటికీలు, తలుపు మూసేశాడు! రూమ్ అంతా చీకటి. ఏదో ఘోరం జరగబోతుందనుకున్నాను.

అంతలో "ఒకసారి పైకి చూడండి..." అన్న అతని గొంతు వినిపించటంతో తలపైకెత్తి చూశాను. రూఫ్‌కు నక్షత్రాలు, చిన్న చిన్న గోళాల మాదిరి ఉన్న బంతులు వేలాడుతున్నాయి.

"రైట్ సైడ్‌లో కనిపించే ఆ పెద్ద గోళం నెప్ట్యూన్, దానికి రైట్‌లో... ... ఇలా గోళాల గురించి ఐదు నిమిషాలపాటు వివరించి లైట్ వేశాడు.

నిజంగానే మరో ప్రపంచంలో అడుగుపెట్టినట్టుగా ఉంది. అక్కడ నిద్రపోతూ సడన్‌గా మెలకువ వస్తే ఎలా ఉంటుందో ఊహించుకుంటే చాలా థ్రిల్‌గా అనిపించింది.

***

ఆ రూమ్‌లో రెండు పడకలున్నాయి. ఒకటి రాకేష్‌ది, మరొకటి సైపుల్లాది. సైపుల్లా ప్రాజెక్టు వర్క్ కోసం కాశ్మీర్ వెళ్ళటంతో రాకేష్ ఒక్కడే ఉంటున్నాడు... ఇలా తన గురించి, తన రూమ్మేట్ గురించి రాకేష్ చెప్తుంటే నా దృష్టి గోడమీద వేళ్లాడుతున్న పెయింటింగ్‌పై పడింది. ఓ గిరిజన అమ్మాయి పెయింటింగ్ అది. పూర్తిగా నగ్నంగా ఉన్న ఆ గిరిజన యువతికి అక్కడక్కడా కొన్ని అలంకారాలు కూడా చేశారు!

ఆ పెయింటింగ్ మీద దృష్టి పడీపడక ముందే "అరెరే... వన్ మినిట్ ప్లీజ్..." అంటూ దాన్ని గభాల్న వెనక్కు తిప్పాడు. చక్కటి వినాయకుడి బొమ్మ దర్శనమిచ్చింది.

"దండం పెట్టుకోండి..." అంటూ పక్కకు జరిగాడు రాకేష్.

పెయింటింగ్ చూడాలనే ఉద్దేశంతో అతని పర్మిషన్ లేకుండానే మళ్ళా వెనక్కు తిప్పాను. ఆ పెయింటింగ్‌లో కనిపిస్తున్న యువతి మెడ, చెవులు, ముక్కుకు బ్లాక్ మెటల్‌తో చేసిన ఆభరణాలు వేలాడుతున్నాయి. నడుముకు నల్లటి దారం, నాభికి దిగువుగా సిగ్గుబిళ్ళ వేలాడ దీసినట్లుగా దారానికి ఓ చిన్న ఆకు వేలాడుతోంది. బొమ్మకుపై భాగాన "శిశిరం కోసం ఎదురుచూడకు..." అని కామెంట్ రాసిఉంది. అతని కళాదృష్టికి జోహార్లు చెప్పాలనిపించింది.

"ఈ బొమ్మ వేసిన తర్వాత శిశిరం రాలేదా?" అంటే,

"వచ్చింది" అని సిగ్గుపడుతూ, "ప్రతి శిశిరంలోనూ ఓ కొత్త రావి ఆకు కడతా..." అన్నాడు.

"రావి ఆకును ఎంచుకోవటంలో ఏమైనా ప్రత్యేకత ఉందా?"

"చూసినవాళ్ళకు జ్ఞానోదయం కలగాలనీ..." అని సమర్థించుకున్నాడు.

ఆ పెయింటింగ్‌కు కుడివైపున దిగువున ఉన్న కార్నర్‌లో చిన్నగా సిగ్నేచర్ కనిపిస్తోంది.

"పెయింటింగ్ మీరే వేశారా?" అంటే,

"నా ఫ్రెండ్ జయదీప్ వేశాడు. మనిషిలోని వీక్‌నెస్ పట్టుకోవటంలో వాడు మంచి మేధావి. అందుకే ఇటువంటి బొమ్మలు వేసి ఫ్రెండ్స్‌కు ఫ్రీగా ఇస్తాడు. అవే వాడికి పెద్ద పబ్లిసిటీ..." అని చెప్పి అతన్ని పరిచయం చేస్తానంటూ పక్కనున్న హాస్టల్ రూమ్‌కు తీసుకు వెళ్ళాడు.

***

అతని రూమ్ మెయిన్ డోర్‌కు పెద్ద రాక్షసుడి తల పెయింటింగ్ ఉంది. ఆ బొమ్మ చెవి రంధ్రంలో కీ హోల్ వచ్చే విధంగా పెయింట్ చేసిఉంది. రూమ్‌లోకి వెళ్ళకముందే ఇలా ఉంది, ఇక వెళ్ళాక ఎన్ని విచిత్రాలు చూడాలో... అనుకుంటుంటే, తలుపు తెరుచుకుంది.

లోపల రూమ్ చాలా సాదా సీదాగా ఉంది. టేబుల్ మీదున్న పెన్ స్టాండ్‌లో కొన్ని బ్రష్‌లు, ఆయిల్ పెయింట్స్ మినహా, గోడల మీద పెయింటింగ్స్ కాదుకదా, కనీసం నీతి వాక్యాలు కూడా కనిపించలేదు.

"నా రూమ్‌లో ఉన్న పెయింటింగ్ చూసి వచ్చారు..." అంటూ పరిచయం చేశాడు రాకేష్.

జయదీప్ మందపాటి అద్దాలు, ఫ్రెంచ్ గడ్డంతో చాలా విచిత్రంగా ఉన్నాడు. అతను వేసుకున్న ఏప్రాన్ మీద డబుల్ మీనింగ్ డైలాగ్స్ రాసి ఉన్నాయి.

"హాయ్..." అంటూ సబ్జెక్ట్‌లోకి వెళ్ళిపోయాడు.

"నా దగ్గర ఉన్న పెయింటింగ్స్ చూసి సెలక్ట్ చేసుకోండి. లేదా, మీకు ఎలాంటి పెయింటింగ్ కావాలో చెప్పండి. కనీసం ఒన్ వీక్ టైం కావాలి. సైజ్‌నుబట్టి రేటు..." అంటూ చెప్పుకుపోతున్నాడు.

అతని మాటకు సమాధానం చెప్పకుండా, "మీ పెయింటింగ్స్ చూశాక, మీ రూమ్ భూతల స్వర్గంలా ఉంటుందనుకున్నాను...." అంటే, హాస్టల్ ఎగిరిపోయేట్టు నవ్వాడు.

నేనేమి అడగాలనుకున్నానో గ్రహించినట్టున్నాడు. "మీరు రాకేష్ రూంలో నా పెయింటింగ్ చూసినట్టుగానో, మరో విధంగానో నా రూంలో గోడలకు బొమ్మలుండవు. ఎవరి ఇంట్రెస్టునుబట్టి వాళ్ళకు బొమ్మలేసిస్తా. నాకు కావల్సింది డబ్బు..." అంటూ అల్మైరాలో ఉన్న కొన్ని బొమ్మలను గోడలకు వేళ్లాడదీసి, మేగ్నిఫైయింగ్ గ్లాస్‌తో వాటిని నిశితంగా పరిశీలించమంటూ వివరించసాగాడు.

"ఇటువంటి బొమ్మలు మీ ఇంట్లో ఎప్పుడైనా తగిలించారా?" అని అడిగితే, గతుక్కుమన్నాడు.

వెంటనే రాకేష్ "అందుకే కదండీ హాస్టల్ రూమ్స్ వదల్లేకపోతున్నాం..." అంటూ ఫ్రెండ్‌ను సపోర్టు చేశాడు. *

ముదిగొండ సాంబశివరావు

సీనియర్ నటి
టి.కనకం
చెప్తోన్న
కబుర్లు...

దిగులుపడలేదు

విజయావారి 'ప్రియురాలు'లో వేశ్యమాత వేషం (లక్ష్మీకాంతం తల్లి వేషం) నాకు నట జీవితంలో స్థిరత్వం ఇచ్చిన వేషం. 'గుణసుందరికథ'లో రజక రామి వేషం. చాన్నాళ్లు నన్ను 'రామి' అని పిలిచేవారు. నా జీవితంలో వేసిన తప్పటడుగు సొంతంగా చిత్ర నిర్మాణం చేపట్టడం. 1956లో మంత్రవాది శ్రీరామమూర్తి, పద్మిని- నాయకా నాయకులుగా 'దేశ దిమ్మరి' చిత్రం తీయాలనుకున్నాను. శ్రీశ్రీ, ఆరుద్ర గారలు మాటలు, పాటలు రాశారు. జిక్కి, బాలసరస్వతి, ఘంటసాల పాటలు పాడారు. పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకులు. అయితే నేను నమ్మి పెత్తనం అప్పచెప్పినవారే మోసం చేయటంతో చిత్రం దాదాపు పూర్తయి ఆగిపోయింది. వేషాలు ఆగిపోయాయి. చేతిలో చిల్లిగవ్వలేదు. వెనకాముందు ఆదరించేవారు లేరు. అయినా నేనేమీ దిగులుపడలేదు. సినిమారంగం వదిలేసినా నాటక కళామతల్లి అక్కున చేర్చుకుంది. నాటకాల్లో ముమ్మరంగా పాల్గొంటున్నాను. బి.ఎ.సుబ్బారావు నిర్మించిన 'భీష్మ'లో సత్యవతి వేషం కోసం తిరిగారు. ఆలస్యంగా కబురందటంతో ఆ వేషం సుజాత వేసింది. 1961 నుండి ఈలపాట రఘురామయ్య ట్రూప్‌లో నాటకాల్లో నటించాను. నల్ల రామ్మూర్తి (శ్రీహరి), మాధవపెద్ది సత్యం (బిల్వ మంగళుడు), రఘురామయ్య (భవానీ శంకరుడు), రేలంగి (సుబ్బిశెట్టి) నేను (చింతామణిగా) వందలాది ప్రదర్శనలు ఇచ్చాం. తర్వాత బాలనాగమ్మ చిత్రంలో లచ్చి వేషం వేసినా వెనుకటి నా స్టార్ ఇమేజ్‌ని అందుకోలేకపోయాను. ఎ.వి.ఎం.వారి 'లేత మనసులు'లో వేశ్య మాత వేషం ఇచ్చారు. 'భక్తప్రహ్లాద', 'అనేకళ్లు'లో నటించాను. 'భక్తప్రహ్లాద'లో పాడుకున్న 'పాములోళ్లమండి... మా ప్రజ్ఞ చూడరండి...' అనే పాట సినిమాల్లో నా చివరిపాట. 1968లో ఎం.ఎస్.రెడ్డి నిర్మించిన 'భార్య'లో వేషం వేసి విజయవాడ వెళ్లిపోయాను. తర్వాత డి.రామానాయుడుగారు పిలిచి 'ద్రోహి' (1970)లో వేషం ఇచ్చారు. అదే నా చివరి చిత్రం. తర్వాత వేషాలేమీ రాలేదు. ఎంతో వైభోగం వెలగబెట్టిన నేను మద్రాసు మహానగరంలో ఇక ఉండలేక పోయాను. డబ్బు విలువ తెలీనిరోజుల్లో ఎన్నో గుప్తదానాలు చేశాను. దుబారా ఖర్చులూ చేశాను. వ్యక్తిగత బలహీనతలకు లోనయ్యాను. ఆ విషయం గురించి ఒక మాట చెప్పాలి. నాకిష్టమైన డ్రింక్ మద్రాసులో దొరికేది కాదు. దానికోసం ఉదయం ఫ్లయిట్‌లో బెంగుళూరు వెళ్లి సాయంత్రం ఫ్లయిట్‌లో మద్రాసు వచ్చేదాన్ని. నెలలో 20 రోజులు అలా చేసేదాన్ని. దాన్నిబట్టి ఎంతగా పతనమయ్యానో ఊహించుకోవచ్చు. 1974లో శాశ్వతంగా విజయవాడ వస్తున్నప్పుడు, శ్రీశ్రీ, ఆరుద్ర ఎంతగా బాధపడ్డారో వారిచ్చిన వీడ్కోలును ఇప్పటికీ మర్చిపోలేను. విజయవాడ వచ్చిన తర్వాత నాన్నగారి మరణం... తర్వాత నేను మేడమీద నుండి పడి ఎలాగోలా బతికి బట్టకట్టడంతో డబ్బంతా ఖర్చయిపోయింది. 150 సవర్ల బంగారం ఖర్చులకే కరిగిపోయింది. చేసిన అప్పులు తీర్చటానికి మళ్లీ నాటకాలు ఆడటం మొదలుపెట్టాను. కురుక్షేత్రం నాటకంలో కృష్ణుడిగా తిరిగి పౌరాణిక నాటకాలు ఆడటం మొదలుపెట్టాను. స్త్రీ అయ్యుండీ స్త్రీపాత్రలు వేయకపోవటానికి కారణం ఉంది. విజయవాడ వచ్చిన తర్వాత చింతామణి ప్రాక్టీస్ చేశాం. విజయా టాకీస్‌లో ప్రదర్శనకు నాకున్న ఒక్కగానొక్క తమ్ముడొచ్చాడు. ఆరోజు నాతోటి నటుడు నాతో వెకిలిగా ప్రవర్తించటం చూశాడు. కారులో ఇంటికి వస్తున్నప్పుడు 'అక్కా ఆ వేషాలు వేయటం మానుకో' అని బతిమలాడాడు. 'నేను రైలు డ్రైవర్‌గా వేలాది మైళ్లు ప్రయాణం చేయాలి. నాకు నువ్వు, నీకు నేను మిగిలాం. నీ గురించి ఆలోచనలు వచ్చినప్పుడల్లా మనసు పాడైపోతుంది. దాని ప్రభావం చాలా తీవ్రమైంది. ఫలితంగా కొన్ని వందలమంది ప్రయాణీకుల ప్రాణాలు పోయే అవకాశముంది" అన్నాడు. ఆ మాటలు నా మనసును కలిచివేశాయి. ఆరోజే ప్రమాణం చేశాను. ఇకముందు నటించ కూడదనుకున్నాను. ఇంతలోనే నా తమ్ముడూ చని పోయాడు. కురుక్షేత్రంలో పీసపాటి, షణ్ముగ ఒకటి రెండు కృష్ణులుగా, నేను మూడో కృష్ణుడుగా చాలా ప్రదర్శనలిచ్చాం. ఆచంట వెంకటరత్నం నాయుడు, ధూళిపాళ దుర్యోధనులుగా చేశారు. విజయవాడ నుండి ఇటు బీహారు, తెలంగాణా, ఆపైన షోలాపూర్, చిక్‌మంగళూరు ప్రయాణాలు చేశాం. కొన్ని సందర్భాల్లో నాటక సమాజాన్ని తీసుకెళ్లిన కాంట్రాక్టర్లు పారిపోతే ఒంటిమీద ఉన్న బంగారం అమ్ముకుని విజయవాడ చేరిన సందర్భాలున్నాయి. శ్రీకృష్ణ రాయబారంలో తిరుపతి వెంకటకవులు రాసిన పద్యాలు ఆరున్నర శృతిలో పాడుతుంటే ప్రేక్షకులు వన్స్‌మోర్ అనటమే ఊపిరిగా అదే ప్రోత్సాహంగా బతుకుబండి సాగిస్తున్నాను. డబ్బు విపరీతంగా సంపాదించిన రోజుల్లో వాటిని దాచుకోవటం తెలియలేదు. కొంత పరిస్థితుల ప్రభావంకాగా తెలియని మనుషుల్ని నమ్మటంవల్ల దగాపడటం ఇవన్నీ వరుసగా నా జీవితంలో సంభవించిన పరిణామాలు. ఆనాటి నటీమణులు ఏ కొద్దిమందో తప్ప మిగిలిన వారెవరూ డబ్బు కూడబెట్టుకోవడం తెలియనివారే. మద్రాస్ ఎన్.ఎఫ్.డి.సి. వారు నెలనెలా ఇచ్చే 750 రూపాయలతో కాలం వెళ్లబుచ్చుతున్నాను. జీవితం ఇంత దుర్భరంగా గడుస్తుందనుకోలేదు. ప్రస్తుతం నా మేనల్లుడు వరప్రసాద్ వద్దే నా జీవితం సాగిస్తున్నాను. విజయవాడ వదిలి ఎక్కడికీ వెళ్లటం లేదు. నా తరం వారెవరూ మిగల్లేదు. కొంతకాలం నా చేతుల్లో పెరిగిన గాయకుడు నాగూర్‌బాబు (మనో), నన్ను 'జలగమ్మా' అని ఆప్యాయంగా పిలిచే జమున ఇంటికి వెళ్లి వస్తుంటాను. ఆ రోజుల్లో అవార్డులు బాగానే వచ్చాయి. ఇటీవల మద్రాసు తెలుగు అకాడమీవారి ఉగాది పురస్కార్, గుప్తా ఫౌండేషన్ అవార్డు, అజో విభో నగదు అవార్డు, 'మా' పురస్కారం లభించాయి. 2004 జనవరి 23న దాసరి నారాయణరావు చేతులమీదుగా అవార్డు అందుకున్నాను. 2005 మార్చి 24న త్యాగరాయ గానసభలో పురస్కారం, ఘంటసాల సినీ గీత వజ్రోత్సవం అవార్డు, 2006 మార్చి 17న త్యాగరాయ గానసభలో సత్కారం అందుకున్నాను.

* * *

రంగస్థలమే జీవితంగా, పద్యమే ప్రాణంగా, నటనే ఊపిరిగా ప్రేక్షక హృదయాల్లో వలపు తలుపులు తట్టిన నటిగా 76 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం చేసిన టి.కనకం జీవితం తీపి, చేదు అనుభవాల కలయిక. ఆమె జీవితం నుండి నేటి కళాకారులు నేర్చుకోవలసిందీ తెలుసుకోవలసిందీ, ఆచరించాల్సింది ఎంతో ఉంది. చేదు అనుభవాలనుంచి తమ జీవన ప్రయాణాన్ని నిర్దేశించుకునే సంకేతాలు కూడా నిండుగా ఉండటం విశేషం. 76 సంవత్సరాల వయసులో కూడా టి.కనకం నటనపట్ల అమితమైన అనురాగాన్ని, అవకాశాలిస్తే తిరిగి నటించాలనే కోర్కెను వ్యక్తం చేయటం కళామతల్లిపట్ల ఆమెకున్న మక్కువకు నిదర్శనం. *

ప్యాంటీ విగ్ కావాలా?



ఏమేం కావాలంటే...

3 ప్యాంటీలు (పిల్లలివి), 2 రిబ్బన్లు, కత్తెర.

ఎలా చెయ్యాలంటే...

ముందు రెండు ప్యాంటీల కాళ్లను కత్తిరించండి. మూడో ప్యాంటీకున్న ఒక్కో కాలికి రెండేసి చొప్పున ముడివెయ్యండి (అచ్చు రెండో బొమ్మలోలా). ఇంక మీకు అర్థమై పోయినట్టుందే. ఎంచక్కా మూడు కాళ్లను కలిపి జడ అల్లండి. చివరికి ఒక రిబ్బన్ ముడి వెయ్యండి. ఇలా రెండు వైపులా జడలు అల్లితే ... ప్యాంటీ విగ్ తయారైనట్టే. దీన్ని ఎంచక్కా తలకు తగిలించుకుని అటూ ఇటూ ఊపుతూ ఆడుకోవచ్చు. భలే తమాషాగా వుంటుంది. పెద్దవాళ్ల సాయంకూడా తీసుకోండే. (ఒక ప్యాంటీ వున్నా విగ్ చెయ్యొచ్చు. కాకపోతే ప్యాంటు కాళ్లకు వేరే గుడ్డ ముక్కలను ముడివెయ్యాల్సి వుంటుంది).

బుజ్జాయిలూ... ఏంటి అలా నీరసంగా వున్నారు? ఓ... బోర్‌గా వుందా? అందుకేగా మీకు ఓ పేద్ద పని పెట్టబోతున్నాము? సరే. మీకు విగ్గు తయారు చెయ్యడం ఎలాగో చెప్తామే.

చేప చిక్కిన గేలం ఏది?



ఆరు తేడాలు ఏవబ్బా!

నేస్తాలూ... ఇక్కడ ఇద్దరు ముసలివాళ్లు కూర్చుని వున్నారుకదా. వీళ్లిద్దరూ కవలలు. చూడ్డానికి ఒకేలా కనిపిస్తారుగానీ... సరిగ్గా ఆరు తేడాలున్నాయి. అవి ఎక్కడున్నాయో మీరే కనిపెట్టాలి. మీరుగాని మనసుపెట్టి పరిశీలిస్తే... అదేమంత పెద్ద కష్టం కాదనుకోండి. మరి రెడీనా!



కుండలోంచి బయటికి రండి చూద్దాం

హలో... ఏంటి 'కుండలోంచి బయటికి రావడం సంగతి తర్వాత. అసలు లోపలికి వెళ్లడం ఎలా?' అని ఆలోచిస్తున్నట్టున్నారే. పైన కుండ పజిల్ వుందికదా. దానికి ఎడమవైపున 'లోపలికి' అని వున్న దగ్గర బయలుదేరి 'బయటికి' అన్న దగ్గరికి రావాలి. మరి మొదలెట్టండీ...

చిన్నారి చిత్రకారులు



చుక్కలు కలిపితే...

హాయ్! కింది బొమ్మలో ఎవరో దాక్కున్నారు. అదీ చుక్కల్లో. వారెవరో తెలియాలంటే... మీరు వెంటనే చుక్కలు కలిపెయ్యండి.



రంగులు అద్దేద్దాం



నేస్తాలూ... చుక్క వున్న ప్రాంతంలో మీకిష్టమైన రంగు అద్ది చూడండి. మీకు చక్కటి బొమ్మ కనిపిస్తుంది.

అట్టమీది కథ

తెలకపల్లి రవి



డావిన్సి కోడ్

హాలివుడ్ హడావుడి

హాలివుడ్‌కు, హడావుడికి చాలా దగ్గరి సంబంధం. 'మంచోచెడో నీ గురించి నలుగురూ చెప్పుకునేలా చూడు' అనేది హాలివుడ్ నీతి సూత్రమంటారు. వందలకోట్ల డాలర్ల పెట్టుబడితో నడుస్తూ వసుధ మొత్తాన్ని ప్రభావితంచేసే హాలివుడ్ విజయాలకు, విశేషాలకూ, వివాదాలకూ కూడా పుట్టినిల్లు. అయితే ఈ వివాదాలు కూడా దానిపట్ల ఆకర్షణ పెంచేవిగా వుండటం కద్దు.

ఇప్పుడు హాలివుడ్ వివాదకాండ 'డావిన్సి కోడ్' సినిమాపై కేంద్రీకృతమైంది. వివాదం మనదేశంతో సహా ప్రపంచమంతటికీ పాకింది. ఆ చిత్రాన్ని విడుదల కానివ్వడమా లేదా అనేదానిపై పెద్ద ఎత్తున తర్జనభర్జనలు జరిగినమీదట చివరికి అనుమతించాలనే నిర్ణయించారు, కాకపోతే మన దేశంలో కాస్త ఆలస్యంగా.

ఈలోగా డావిన్సి కోడ్ ఇతర దేశాల్లో విడుదలైంది. దానిపై రకరకాల వ్యాఖ్యలూ విమర్శలూ వచ్చాయి. వీటన్నిటిమధ్యనా అది వసూళ్లు బాగానే చేసుకుంది. ఇంతకుముందరి రికార్డులు బద్దలుకొట్టలేకపోయినా విజయవంతమైన చిత్రాల కోవలోనే చోటు సంపాదించింది. ఆ మేరకు దానిపై సాగిన వివాద గ్రస్త ప్రచార కాండ సత్ఫలితాన్నిచ్చినట్లే! రోమన్ క్యాథలిక్‌లు బలంగా వున్న చోట్ల ఇప్పటికీ దానిపై విమర్శలు, హెచ్చరికలు సాగుతూనే వున్నాయి.

ఇంతటి వివాదానికి, విజయానికి కారణమైన డావిన్సి కోడ్ కథ కమామిషు ఏమిటి? ఇందులో మంచి చెడ్డలేమిటి? హాలివుడ్‌లో ఇంత వివాదం తలెత్తడానికి కారణాలేమిటి?

నవలతో మొదలు...

మూడేళ్ల కిందట డాన్ బ్రౌన్ అనే రచయిత 'ద డావిన్సి కోడ్' పేరుతో రాసిన నవల సంచలనం సృష్టించింది. ఇప్పటివరకూ రికార్డుగా చెప్పబడే 'హారీ పాటర్'ను తలపించేలా లక్షల ప్రతులు అమ్ముడై ప్రచురణకర్తలకు కనకవర్షం కురిపించింది. క్రీస్తు జీవితానికి, క్రైస్తవ మత విశ్వాసాల పరంపరకు సంబంధించిన అనేక అంశాలతో ముడిపడినప్పటికీ ఆ నవల ఇతివృత్తం ప్రధానంగా ఒక హత్యా రహస్యాన్ని ఛేదించడానికి సంబంధించింది. దానిలో అపరాధ పరిశోధక లక్షణాలు, సస్పెన్స్, నిగూఢ కథనం పాఠకులను ఆకర్షించిన అంశాలు.

పారిస్‌లోని లోవర్ మ్యూజియంలో ప్రముఖ క్యూరేటర్ అయిన జేక్స్ శ్యామూరి రాత్రి పదిగంటల తర్వాత ఒక బలిష్టమైన వ్యక్తి చేతుల్లో హత్యాయత్నానికి గురవుతాడు. చంపబోయే ముందు ఆగంతుకుడు ఏదో విషయంగురించి శ్యామూరిని గుచ్చిగుచ్చి అడుగుతాడు. శ్యామూరి ఒకే సమాధానమిస్తాడు. మీ బృందంలోని మిగిలిన వారు కూడా ఇదే చెప్పారు గాని అసలు సంగతి చెప్పు అని అతడు రెట్టిస్తాడు. తమ రహస్య బృందంగురించి అతనికి తెలిసిపోయిందని ధృవీకరించుకున్న శ్యామూరి పెదవి విప్పడు. అతను దాదాపు చంపేసి వెళ్ళాక సర్వశక్తులూ కూడదీసుకుని తను చెప్పదలుచుకున్న సందేశం రాయాలనుకుంటాడు. అందుకోసం అతను చేసే ప్రయత్నం వళ్లు గగుర్పొడిచేదిగా వుంటుంది. మృతదేహాన్ని పరీక్షించిన నిపుణులు అది అంత భయంకరంగా వుండటానికి కారణం తెలుసుకుని హతాశులవుతారు.

ఆ దశలో నగరంలో ఉపన్యాసం ఇవ్వడానికి వచ్చిన సంజ్ఞాశాస్త్ర నిపుణుడు లంగ్డన్‌ను పోలీసులు సహాయంకోసం పిలిపిస్తారు. వాస్తవానికి అతన్ని పిలిపించినపుడు రహస్య సంస్థల గురించే మాట్లాడుతుంటాడు. మృతదేహాన్ని, దాని దగ్గర గీయబడిన రక్త నక్షత్రాన్ని చూడగానే అతను చూచాయగా విషయం గ్రహిస్తాడు. కాని చనిపోయిన వ్యక్తి చెప్పదలుచుకుందేమిటో పరిశోధించాలనుకుంటాడు. ఈ క్రమంలో అతనికి హతుడి మనమరాలు కలుస్తుంది. ఆమె కూడా సంజ్ఞాశాస్త్ర నిపుణురాలే. తాత ఏదో దాచిపెట్టాడని ఆమెకు తెలుస్తుంది. అక్కడినుంచి కథ మలుపులు తిరుగుతుంది. అనేక రహస్యసంస్థల తరపున మతాధికారులు, వారి అనుయాయులు ఎన్నో అంతుపట్టని పనులు చేస్తారు. లంగ్డన్ కొన్ని ప్రమాదాలూ ఎదుర్కొంటాడు. పోలీసులు అతన్ని అనుమానిస్తారు కానీ చివరికి అసలు రహస్యం ఛేదించబడుతుంది.

ఏసుక్రీస్తు జీవితంలో మగ్దలీనా అనే మహిళ వుందని క్రైస్తవుల్లో ఒక వర్గం నమ్ముతుంది. వారిద్దరూ ప్రేమించుకున్నారని, అయితే ఆదాము అవ్వల కథవల్ల స్త్రీ, శృంగారం క్రైస్తవ మతానికి పొసగదనే భయంతో కొందరామె కథను కప్పిపుచ్చారని ఒక అభిప్రాయం. మగ్దలీనాను ప్రేమించినట్లుగాక వేశ్యగా వున్న ఆమెను వుద్ధరించడానికే క్రీస్తు సన్నిహితంగా మసలినట్టు చెబుతారు. ఆయన శిష్యుల్లో మగ్దలీనా కూడా వున్నట్టు చెప్పే కథ ఒకటి. క్రీస్తు మూడ్రోజుల తర్వాత పునరుద్ధానం చెందినపుడు చేసిన చివరి విందులో ఆమె కూడా పాల్గొన్నట్టు మరో కథ. కాని ఇవన్నీ జీసస్ వ్యక్తిత్వానికి భంగకరమని భావించి వాటికి వేర్వేరు వ్యాఖ్యానాలు చెప్పడం ప్రారంభించారు. డావిన్సి కోడ్ కథకు మగ్దలీనా కథే పునాది. క్రీస్తు మగ్దలీనాను పెళ్లి చేసుకున్నాడని, క్రీస్తు మరణించాక ఆమె మార్సిలే ప్రాంతానికెళ్లి సారా అనే పాపను కన్నదని, వారి వారసులు ఇప్పటికీ కొనసాగుతున్నారని... అయితే వారెక్కడున్నారనే సంగతి బయటకు రాకుండా చేశారని, దాన్ని కాపాడటానికే చర్చి తరపున కొన్ని సంస్థలెప్పుడూ రహస్యంగా పనిచేస్తుంటాయని డావిన్సి కోడ్ రచయిత డాన్ బ్రౌన్ కథనం. ఈ కార్యకలాపాలన్నిటినీ నడిపించే ప్రయరీ ఆఫ్ సియాన్ అనే రహస్య సంఘం(1909) గురించి చెప్పడంతో మొదలుపెడతాడు. తను పేర్కొంటున్న సంస్థలన్నీ నిజంగా వున్నాయని మొదటే ప్రకటిస్తాడు. కథలో చివరికి హతుడి మనవరాలు సోఫీనే ఆ సంతతి వారసురాలని వెల్లడవుతుంది! ఈ రహస్యసంస్థలో లియనార్డో డావిన్సి, ఐజాక్ న్యూటన్ లాంటి అతిరథ



మహారథులంతా వుండేవారట.

బహుముఖ ప్రజ్ఞాశాలి, అద్భుత చిత్ర కారుడు అయిన డావిన్సి తన చిత్రాల్లో రహస్య సందేశాలను నిక్షిప్తం చేసేవాడని డాన్ బ్రౌన్ చెబుతాడు. అందుకే నవలకు డావిన్సి కోడ్ అని పేరు పెట్టారు.

ఉద్వేగ భరితమైన సన్నివేశాలతో నడిచే ఈ నవల క్రీస్తు జీవితంతో ముడిపడినది కావడంతో సహజంగానే గొప్ప సంచలనం కలిగించింది. నవలగానే అనేక వివాదాలు ఎదుర్కొంది. దాని కొనసాగింపుగా చిత్రరూపమూ పొందింది. నవలగా వున్నప్పటి కంటే సినిమాగా వచ్చినపుడు ఎక్కువమంది చూస్తారు గనక దాన్ని విడుదల కానివ్వరాదంటూ క్యాథలిక్ సంఘాలు ఆందోళన చేశాయి. రోమ్‌లో క్యాథలిక్ గ్రూపులు, క్రైస్తవ మిలిటెంట్లు తీవ్ర హెచ్చరికలు చేశారు. 'డామ్ బ్రౌన్, ఒకనాటికి నీపై కూడా తీర్పు చెప్పే రోజొస్తుం'దని నినాదాలు చేశారు. రోమ్‌కు సమీపంలోని కేకానో గ్రామంలో ఈ పుస్తకాన్ని తగలబెట్టినపుడు ఘర్షణలకు దారితీసింది. అమెరికాలో కుటుంబం, సంప్రదాయం, ఆస్తి సంరక్షణ సంఘం ఈ చిత్రాన్ని ఖండిస్తూ పూర్తి పేజి అడ్వర్టయిజ్‌మెంట్ ఇచ్చింది. కనీసం వంద సినిమా హాళ్ల ఎదుటనైనా దానికి వ్యతిరేకంగా ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చింది. ఇండియాలో కూడా దీనిపై అనేక నిరసనలు వచ్చినా చివరికో ఒప్పందం కుదిరింది.

బైబిల్ కథలతో చిత్రాలు

ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవమతస్తులు అధికంగా వున్నందున సహజంగానే బైబిల్ కథల ఆధారంగా వచ్చిన చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. వాటిలో సుప్రసిద్ధమైంది టెన్ కమాండ్‌మెంట్స్. తర్వాత కోవాడిస్, బెన్‌హర్ వంటివి. ఇవన్నీ నిర్మాణం, నటన, సాంకేతిక నైపుణ్యాల్లో అత్యున్నత శిఖరాలధిరోహించాయి. మరోవైపు బైబిల్‌ను పూర్తిగా అనుసరించకుండా స్వేచ్ఛ తీసుకుని రూపొందించిన చిత్రాలూ వున్నాయి. క్రైస్తవమత విశ్వాసాలకు భిన్నమైన ఇలాంటి ప్రయత్నాలపై భిన్నాభిప్రాయాలు, వివాదాలు చాలాసార్లు తలెత్తాయి. లాస్ట్ టెంప్టేషన్ ఆఫ్ క్రైస్ట్, ప్యాషన్ ఆఫ్ క్రైస్ట్ వంటి చిత్రాలు ఈ కోవలోవే. వాటిపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు సాగాయి. జ్వాలలు రేగాయి. అయినా విజయవంతమయ్యాయి.

భారీ నిర్మాణం..

సోనీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ డావిన్సి కోడ్ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించింది. 'ఎ బ్యూటిఫుల్ మైండ్' చిత్రంతో ఆస్కార్ అవార్డు సాధించిన దర్శకుడు రాన్ హోవార్డ్ నిర్దేశకత్వం చేపట్టగా రెండు ఆస్కార్లు అందుకున్న ప్రపంచ ప్రసిద్ధ నటుడు టామ్ హ్యాంక్స్ కథానాయకుడి పాత్ర ధరించాడు. అంతేగాక ఈ ఉభయులూ చిత్ర ప్రచారంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. కేన్స్ చిత్రోత్సవానికి వెళ్తూ మధ్యలో లండన్‌లో వారు కనిపించినపుడు సంరంభం మిన్నుముట్టింది. ఈ చిత్ర నిర్మాణానికి 12.5 కోట్ల డాలర్లు అంటే దాదాపు 600 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. కథ ప్రకారం లావ్రే మ్యూజియంతో సహా అనేక అందమైన లొకేషన్లను ఎంపికచేశారు. మ్యూజియంను చిత్రంలో చూపించ వచ్చు గాని అక్కడున్న కళా ఖండాలపై ఎలాంటి కాంతి ప్రసరించకూడదని, విశ్వ విఖ్యాతమైన మోనాలిసా చిత్రాన్ని ఏ విధంగానూ చిత్రీకరించకూడదని షరతు పెట్టారు. దాంతో ఒక నమూనాను ఉపయోగించారు. చరిత్రాత్మకమైన వర్సయిల్స్ భవనం(పారిస్), లండన్‌లోని టెంపుల్ చర్చి, వెస్ట్ మినిస్టర్ అబే (కేవలం బయటి దృశ్యాలు మాత్రమే), స్కాట్లండ్‌లోని రోసిలిన్ చాపెల్, ఇటలీలోని లింకన్‌షైర్ స్టుడ్ వగైరాలను చిత్రంలో చూపించారు. చిత్రంలో పవిత్ర ప్రదేశాలను చూపించే సన్నివేశాలను మాల్టాలో తీశారు. ఇలా విడుదలకుముందే డావిన్సి కోడ్ హాలివుడ్‌లో పెద్ద ఆకర్షణగా మారింది. దీనికితోడు సోనీ కంపెనీకి, యూనివర్సల్‌కు మధ్య చిత్రం తాలూకూ సిడిల విడుదలపై పెద్ద వివాదం నడిచి చివరికి కోర్టు బయటే పరిష్కారమైంది.

విమర్శల వెల్లువ: దర్శకుడి జవాబులు

ఇక చిత్రం క్రైస్తవుల మనోభావాలను గాయపరుస్తుందన్న వాదనను దర్శకుడు రాన్ హోవార్డ్ ఆమోదించలేదు. ఇది పూర్తిగా వినోదంకోసం ఉద్దేశించింది. అది అర్థం చేసుకోనందున ఇంత గొడవ జరుగుతున్నది. ఇది మత విషయం కాదని స్పష్టంచేశారు. కథ కేవలం కల్పితమని ప్రకటించాలన్న సూచనను హోవార్డ్ తోసిపుచ్చి ఇది చరిత్ర కాదు, మతైక కథా కాదు అన్నారు. గూఢచారి కథలెప్పుడూ నిజం కాదన్న ప్రకటనతో ప్రారంభం కావన్నారు. దీనిపై క్యాథలిక్ బృందాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఫ్రాన్సిస్ ఆరింజ్ అనే మతాధిపతి దీనిపై చట్టబద్ధమైన చర్య తీసుకోవాలేగాని క్షమించడం మరిచిపోవడం క్రైస్తవ సంప్రదాయమన్న రీతిలో పూరుకోకూడదని గట్టిగా కోరాడు. ఓపస్ డై అనే సంస్థ ప్రతినిధులు కనీసం నిజం కాదనే ప్రకటన జోడించి వుండాల్సింది, క్రైస్తవులపట్ల మర్యాదకు నిదర్శనమయ్యేదన్నారు. ఇందులో ఏదైనా పోలిక కనిపిస్తే యాదృచ్ఛికమేనన్న స్పష్టీకరణ వుండాలన్న సూచనపై హోవార్డ్ 'ఈ చిత్రం కల్పనన్నది తేటతెల్లం. ఈ పాత్రలన్నీ కల్పితమని తెలుస్తూనే వుంటుంది' అన్నారు.

విమర్శకు లేమన్నారు?

ఇతివృత్తాన్ని బట్టి ఇన్ని వివాదాలకు కారణమైన ఈ చిత్రం విడుదలయ్యాక విమర్శకులను పెద్దగా ఆకట్టు కోలేకపోవడం ఆసక్తికరమైన విషయం. కేన్స్ చిత్రోత్సవంలో తొలి చిత్రంగా దీన్ని ప్రదర్శించినపుడు చూసిన విమర్శకులు, అనుభవజ్ఞులు దాంట్లో పెద్ద సరుకులేదని చప్పరించారు. చిత్రం ఆఖర్లో నాయకుడు ప్రధాన కథాంశాన్ని ఏకరువు పెట్టినపుడు హాలులో ప్రేక్షకులు గంభీరంగా వినడంపోయి నవ్వులు ముసురుకున్నాయట! 148 నిమిషాలు నడిచే ఈ చిత్రం నవల చదవకుండా చూస్తే చాలా గజిబిజిగా వుంటుందంటున్నారు. ఫ్లాష్‌బ్యాక్‌లతో కథలు నడిపించడంలో సిద్ధహస్తుడైన హోవార్డ్ ఈ చిత్రంలో వాటిని మరీ ఎక్కువగా ఉపయోగించి విసుగెత్తించినట్లు విమర్శలొచ్చాయి.

మే 18,19 తేదీల్లో (ఇండియా వంటి దేశాల్లో మినహా) విడుదలైన తర్వాత వచ్చిన సమీక్షల్లో చిత్రం విసుగెత్తించేదిగా వుందని, రావలసిన దానికి భిన్నమైన స్పందన తెస్తున్నదని చాలా విమర్శలు. హాలివుడ్ భగవద్గీతలా పరిగణించబడే వెరైటీ పత్రిక చిత్రం విసుగెత్తించేవిధంగా వుందని వ్యాఖ్యానించింది. చిత్రంలో తారలు బిగుసుకుపోయి నటించారని, ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయారని హాలివుడ్ రిపోర్టర్ రాసింది. ఇంగ్లాండులోని గార్డియన్ పత్రిక ఇది థ్రిల్లర్ అయినప్పటికీ థ్రిల్ చేయలేకపోయిందని చప్పరించింది. తొలి సమీక్షలు నిరాశాజనకంగానూ, నిరుత్సాహకరంగానూ వున్నాయని హోవార్డ్

భారత్‌లో వారం లేటు.....

కాథలిక్ క్రైస్తవ సంఘాల నిరసన కారణంగా డావిన్సి కోడ్ చిత్రం మనదేశంలో వారం ఆలస్యంగా విడుదలవుతున్నది. ఇండియాలో కోటీఎనభై లక్షలమంది క్యాథలిక్‌లున్నారు. జీసస్ జీవితానికి సంబంధించిన ఈ చిత్ర కథ తమ విశ్వాసాలకు విఘాతం కలిగించేట్లు వున్నందున విడుదల చేయరాదని ఆ సంస్థలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. సాధారణంగా చిత్రాల విడుదల విషయంలో తుది నిర్ణయం తీసుకోవలసింది సెన్సార్ బోర్డు. కాని దానికన్నాముందే సమాచార ప్రసార శాఖామంత్రి ప్రియరంజన్‌దాస్ మున్షీ చిత్రం చూసి చెబుతానని బయల్దేరారు. చూసిన తర్వాత సెన్సార్‌బోర్డు క్రైస్తవసంఘాల అభిప్రాయాలు తెలుసుకుని తుదినిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. తర్వాత దశలో బోర్డు చిత్రాన్ని ఆలస్యంగా విడుదలచేయాలని నిర్ణయించింది. అందుకు ఒక షరతు కూడా విధించింది. చిత్రంలోని పాత్రలు సన్నివేశాలు వాస్తవం కాదన్న ప్రకటన ప్రముఖంగా ముందే చూపించాలన్నది షరతు.(నవలలోనైతే ఇందులో పేర్కొన్న రహస్య సంస్థలన్నీ నిజంగా వున్నాయన్న ప్రకటన ప్రముఖంగా ప్రత్యేక పేజీలో వుంటుంది) ఎట్టకేలకు చిత్రాన్ని అనుమతించినప్పటికి అందుకు అనుసరించిన పద్ధతి సరైంది కాదన్న విమర్శ వినిపించింది. సెన్సార్‌బోర్డు పనిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, భావ ప్రకటనాస్వేచ్ఛపై అవాంఛనీయమైన హద్దులు పెట్టడం, మత సంస్థలు చూసి ఆమోదిస్తేనే విడుదలకు అనుమతిస్తామన్న ప్రకటన లౌకిక ప్రజాస్వామిక స్ఫూర్తికి అనుగుణంగాలేదని హిందూపత్రిక విమర్శించింది. గతంలో కూడా ముస్లిం దేశాలకన్నా ముందే మనం శాటనిక్ వర్సెస్ నవలను నిషేధించిన సంగతి ఈ సందర్భంగా అందరికీ గుర్తుకొచ్చింది. ఇప్పుడు కూడా కాథలిక్ సంస్థలు నిషేధంకోసం పట్టుపట్టలేదు కనక సరిపోయింది కాని లేకపోతే అలాంటి నిర్ణయానికి వెనుకాడివుండేవారు కారని వ్యాఖ్యాతలు రాశారు. చిత్రాల్లో క్రైస్తవులను గొప్పగా చూపించరు, వ్యాంప్ పాత్రలకు తరచూ జూలీ, మేరీ, రోజీ వగైరా పేర్లు పెట్టి ఆంగ్లో ఇండియన్ తరహాలో చూపిస్తుంటారు. బాలివుడ్ నిరంతరంగా సాగించే ఈ అనౌచిత్యాలను పట్టించుకోకుండా అనవసర వివాదాలెందుకని ఒక విమర్శకురాలు ప్రశ్నించారు. ఈలోగా డావిన్సి కోడ్ మలయాళ అనువాదం విడుదల కాబోతున్నట్టు వార్తలొచ్చాయి. కేరళలో క్రైస్తవ జనాభా అధికమన్న సంగతి తెలిసిందే. అప్పుడే అక్కడ ఇద్దరు క్రైస్తవ మతాధిపతులు నవల విడుదల కాకూడదంటూ ప్రకటన చేశారు. మరి దాని ప్రభావం ఎలా వుంటుందో చూడవలసిందే. భారతదేశంలో భావ ప్రకటనాస్వేచ్ఛ వున్నా అది నిర్నిబంధమైనది కాదు. ముఖ్యంగా ఈ దేశంలోని విభిన్నవర్గాల మనోభావాలను గమనంలో పెట్టుకుని సమాజశాంతికి భంగం కలిగించనిరీతిలో వ్యవహరించాలన్న సూత్రాన్ని తరచూ ఉటంకిస్తుంటారు. కనుక నిర్ణయాలు వాటి ప్రభావాన్నిబట్టి తీసుకోవలసి వుంటుంది.

అంగీకరించారు. అయితే విమర్శకులు చెప్పేది ప్రేక్షకులు భావించేది ఒకేవిధంగా వుండకపోవచ్చునని కూడా ఆయనన్నారు. విమర్శకులు ప్రతికూలవైఖరితో చూడటం సహజం. కాని ప్రేక్షకులు సానుకూలంగా స్పందిస్తారన్నారు. తొలి వసూళ్లు ఆయన విశ్వాసానికి అనుగుణంగా వుండటం వాస్తవం. సమీక్షలు చప్పగా వచ్చిన కారణంగా చిత్రం వసూళ్లు దెబ్బతినవచ్చునని హాలివుడ్ వర్గాలు భావించినా అది నిజం కాలేదు.

ప్రజలే నిర్ణేతలు

మతాలు, దేవుళ్లకు సంబంధించిన ఇతివృత్తాలు తీసుకోరాదని ఎవరూ చెప్పరు. సృజనకు, కల్పనకు అవి అతీతం కాదు. అయితే ఆ కథలు అవగాహనను పెంచేవిగానూ, విజ్ఞానానికి దోహదపడేవిగానూ వుండటం వాంఛనీయమవుతుంది. కాని హాలివుడ్ సూత్రాలు వేరు. హావర్డ్ చెప్పినట్టు వారికి ప్రతిదీ జనాకర్షణ సాధనమే. అంతరిక్షంగురించి తీసినా, అడవిజంతువుల గురించి తీసినా, ప్రపంచ యుద్ధాలను చూపించినా అత్యధిక ప్రేక్షకులను రాబట్టి అంతులేని వసూళ్లు పోగుపోసుకోవడం మినహా దానికి వేరే ఎజెండా వుండదు. ఈ క్రమంలో ఒకరి మనోభావాలతో నిమిత్తం లేదు. ఉదాహరణకు మతాలగురించి, వాటి పరిణామం గురించి చెప్పాలంటే వాస్తవికదృష్టితో తీయొచ్చు. కాని ఏదోవిధమైన వివాదం, దుమారం వుంటే తప్ప జనం విరగబడి చూడరు గనక అలాటి ఇతివృత్తాలను ఎంచుకుంటారు. ఈ చిత్రం తీసిన వారు, విమర్శకులు అందరూ ఒకే మతాన్ని అనుసరించేవారైనా వారిమధ్య తేడాలున్నాయి. వసూళ్లవరంగా సంచలనం కలిగించాలన్న తాపత్రయం మాత్రమే ప్రేరణ. అయితే అదే సమయంలో మతవిశ్వాసాలకు సంబంధించి రకరకాల వాదనలు, కోణాలు వుంటాయి. వాటిని ఇదమిద్ధంగా నిర్వచించడం, నిర్ణయించడం చాలా కష్టం. ఏదైనా పొరబాటు జరిగితే ప్రజలే ఆదరించకుండా తిప్పికొడతారు. కనక మత విశ్వాసాలు గాయపడతాయనే పేరుతో చిత్రాలను లేదా కళారూపాలను తేలిగ్గా నిషేధించడం సమంజసమనిపించుకోదు. హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర అన్ని మతాల్లోనూ తమ భావాలను కించపరిచారంటూ ఏవో నిరసనలూ అభ్యంతరాలు వస్తుంటాయి. వాటిని పరిశీలించి సంయమనంతో తగు నిర్ణయం తీసుకోవాలి. చిత్రం నడుస్తున్నకొద్దీ ప్రేక్షకుల స్పందన తెలుస్తున్నకొద్దీ ఏం జరుగుతుందో చూడాలి. దాన్ని ప్రేక్షకుల విజ్ఞతకు, చైతన్యానికి వదిలిపెట్టడం ఉత్తమం. ఆ సంగతెలా వున్నా డావిన్సి కోడ్ అప్పుడే చలన చిత్ర చరిత్రలో ఒక స్థానం సంపాదించిన్నది నిజం.

*

వివాదాల వెల్లువలో వసూళ్ల వర్షం!

డావిన్సి కోడ్‌పై వివాదాలు దాని విజయానికి ఏమాత్రం ఆటంకం కాకపోవడం విశేషం. మత భావాలెలా వున్నా దాన్ని కేవలం కథగానే చూశారన్న వాస్తవం విదితం. చిత్రం ఇప్పటికే ఇటలీ, స్పెయిన్ దేశాల్లో గత రికార్డులు బద్దలుకొట్టింది. లాటిన్ అమెరికా, చైనాల్లో కూడా భారీ వసూళ్లు చేసింది. ఆరుకోట్ల డాలర్లు ప్రారంభ వసూళ్లు రావాలన్నది అమెరికాలో లెక్క. మేము ఇప్పటికే దాన్ని అధిగమించామని ఆ చిత్రం అందించిన సోనీ సంస్థ వైస్ ఛైర్మన్ జెఫ్ బ్లాక్ ప్రకటించారు. అసంతృప్తికరంగా వెలువడిన సమీక్షల ప్రభావం ఏమీలేదని కూడా పేర్కొన్నారు. మా కథ చాలా గొప్ప కథల్లో ఒకటి. అందుకే అత్యద్భుత విజయం మా సొంతం కాబోతున్నదన్నారు. వివిధ దేశాల్లో మొత్తం 22.4 కోట్ల డాలర్లొచ్చాయి. ఇది చరిత్రలో రెండవ పెద్ద ప్రారంభ విజయం అని చిత్రాన్ని పంపిణీ చేసిన కొలంబియా ప్రకటించింది. ప్రతికూల సమీక్షల నేపథ్యంలో ఈ చిత్రం అనుకున్నంత ఆదాయం పొందలేకపోవచ్చునని హాలివుడ్ వర్గాలు భావించాయి. ఇటీవలనే మిషన్ ఇంపాజిబుల్, పోసిడెన్ చిత్రాలు ఆశించిన స్థాయిలో వసూళ్లు చేయలేకపోవడం ఇందుకొకకారణం.

ఇంతవరకూ హాలివుడ్ వసూళ్లలో అత్యధిక ప్రారంభ వసూళ్లు స్పైడర్ మ్యాన్‌కు వచ్చాయి. 2002లో ఆ చిత్రం 11.5 కోట్ల డాలర్ల ప్రారంభ వసూళ్లు చేసింది. దానితో పోలిస్తే డావిన్సి కోడ్ ఆదాయం తక్కువే. టైటానిక్ కూడా ఇంతకన్నా ఎక్కువ వసూలు చేసింది. అమెరికా వెలుపల లోగడ స్టార్‌వార్స్ వసూళ్ల తర్వాతి స్థానం కోడ్‌కు దక్కింది. హాలివుడ్ ఈ చిత్రం విజయాన్ని వూపిరి బిగబట్టి గమనిస్తోంది. దాని ఘన విజయంతో కొత్త సీజన్ ప్రారంభమైతే మిషన్ ఇంపాజిబుల్-3, మాత్రమే కాక సెప్టెంబరు 11 ఘటనల ఆధారంగా తీసిన వరల్డ్ ట్రేడ్ సెంటర్ చిత్రం కూడా విడుదల చేయాలని ఎదురుచూస్తున్నది. ఇప్పుడు వాటికి కూడా ఉత్సాహం రావచ్చు. దీన్నెలా తీసి వుంటారనేది రాజకీయంగా కూడా చాలా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. సెప్టెంబరు 11 పై తీసిన డాక్యుమెంటరీ ఫారెన్‌హీట్11 కే అపూర్వమైన వసూళ్లు కురిసిన సంగతి గుర్తుండే వుంటుంది.

చిరంజీవి శ్రీనివాసరావు

వేదగిరి రాంబాబు



సౌకర్యమే ఒక్కోసారి అసౌకర్య మౌతుందేమో. సుఖంగా ప్రయాణం సాగించడానికి కొనుక్కున్న వాహనమే ప్రాణాలు తీయడమంటే అంతేకదా మరి. ఊహించని విషయాలు జరగడమే జీవితం అనిపిస్తుంటుంది, కొన్ని విషయాలు తెలిసినప్పుడు.

మనుషుల సంఖ్య పెరుగుతోంది. దాంతోపాటు వాహనాల సంఖ్యా పెరుగుతోంది. అందువల్ల రద్దీ పెరుగుతోంది. ట్రాఫిక్ క్రమబద్ధంగా సాగితే అంతా సక్రమంగానే వుంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, యాక్సిడెంట్లు జరిగి, కొందరి తప్పుకు మరికొందరు బలవుతున్నారు. మనం ట్రాఫిక్‌లో పద్ధతి ప్రకారం వెళ్తూ కూడా ఎదురుగా వచ్చేవాళ్ళ నిర్లక్ష్యానికి ఫలితాన్ని అమాయకంగా అందుకోవాల్సివస్తుంది.

గొట్టిపాటి శ్రీనివాసరావు హైదరాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేసేవారు. వయసు 33 సంవత్సరాలు. ఓరోజు ఆయన తన స్కూటర్‌మీద వస్తున్నారు. ట్రాఫిక్ కూడా పెద్దగాలేదు. అయినా ప్రమాదం లారీ రూపంలో వెనుకనుంచి దూసుకొచ్చింది. హఠాత్తుగా వెనుకనుంచి లారీ గుద్దడంతో బండితోబాటు శ్రీనివాసరావు విసిరేసినట్లు రోడ్డుమీద దూరంగా పడ్డాడు.

ఇలా రోడ్డు యాక్సిడెంట్లు జరిగినప్పుడు తల రోడ్డుకో, ఏ రాయికో తగిలి పగలవచ్చు. బ్రెయిన్‌డెత్ సంభవించవచ్చు. మెదడు దెబ్బతిని మరణించడాన్ని 'బ్రెయిన్‌డెత్' అంటారని మనకు తెలిసిందే. బ్రెయిన్ మరణించడంతో క్రమంగా శ్వాస ఆగుతుంది. గుండె కొట్టుకోవడం ఆగిపోతుంది. పూర్తిగా మరణం సంభవిస్తుంది. బ్రెయిన్‌డెత్‌ను న్యూరాలజిస్టులు, న్యూరోసర్జను నిర్ధారిస్తారు.

బ్రెయిన్‌డెత్‌కు లోనైన వ్యక్తి కనుగుడ్డును తాకుతూ చేతివేళ్ళను కదిలించినా కంటిలో కదలిక వుండదు. టార్చ్‌ద్వారా కాంతిని కనుగుడ్డుమీదికి ప్రసరింపజేసినా కనుగుడ్డు కదలదు.

బ్రెయిన్‌డెడ్ ఐనట్టు వైద్యులు నిర్ధారించినమీదట వెంటిలేటర్‌మీదపెట్టి కొన్ని గంటలు, రోజులు శ్వాసించేట్టు చేయగలరు. కానీ మెదడును బ్రతికించలేరు. సరిగ్గా ఇలాంటి స్థితిలోకి వచ్చారు శ్రీనివాసరావు. వైద్యులు విషమ పరిస్థితిని గుర్తించారు. భార్య శోభారాణికి మిగతా కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

వాస్తవాలను వాస్తవాలుగా చెప్పగలిగేవాళ్ళూ మనమధ్య వున్నారు. అలాగే వాస్తవాల్ని జీర్ణంచేసుకుని తాము కష్టంలో వుండి కూడా ఇతరుల మేలుగురించి ఆలోచించి ప్రాణదానం చేయగలిగినవాళ్ళూ వున్నారు. డా॥ గోపాలకృష్ణ గోఖలేగారుశ్రీనివాసరావుగారి భార్య శోభారాణిగారితోపాటు అమెరికాలో వున్న ఆమె సోదరితో కూడా మాట్లాడారు. శ్రీనివాసరావు గారి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. వాళ్ళక్కూడా విషయం పూర్తిగా అర్థమైంది. అందుకే అంత బాధలోనూ మానవత్వ పరిమళాల్ని వెదజల్లే నిర్ణయాన్ని తీసుకున్నారు.

బాధలో వున్నప్పుడు ఎదుటివాళ్ళందరూ తమని ఓదార్చాలను కునేవాళ్ళే ఎక్కువగా కనిపిస్తున్న ఈ రోజుల్లో తమ బాధను దిగమింగి ఇతరుల బాధను అర్థంచేసుకుని వాళ్ళకు ఊహించనివిధంగా తోడ్పడగలిగే వాళ్ళున్నారని శ్రీమతి శోభారాణి నిరూపించారు.

బ్రెయిన్‌డెత్ పొంది వెంటిలేటర్స్‌మీదున్న భర్త ఎలాగూ చనిపోతాడు. అతని అవయవాల్ని దానంచేసి ప్రాణాపాయంలో వున్నవాళ్ళకు సాయం చేయాలని, తద్వారా తన భర్తను చిరంజీవిని చేయాలని ఆవిడ తీసుకున్న నిర్ణయం హర్షణీయం.

ఆరోజు సంక్రాంతి. కొత్త కాంతి. శ్రీనివాసరావుగారి కాలేయము, కార్నియా (కళ్ళు), మూత్రపిండాల్ని దానంచేశారు. కారుణ్యమనే కొత్తకాంతిని ప్రసరించచేసి ఐదుగురికి కొత్త జీవితాన్ని ఇచ్చారు.

✻



కథ

వి నాగరత్న

ఓ అమ్మకథ

వెంకటమ్మ ఎంత వేగంగా అడుగు లేస్తోన్నప్పటికీ కొడుకుతో సమానంగా నడవలేపోతోంది.

కొడుకు సూర్యప్రకాష్ మెల్లగానే నడుస్తున్నాడు కానీ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ తల్లికంటే ముందు వెళ్తున్నాడు.

ఆవిడ చేతిలో బట్టతో కుట్టిన ఒక చేతిసంచీ వుంది. అందులో రెండు జతల బట్టలున్నాయి. డెబ్బయ్యేళ్ళ వృద్ధురాలైనందున ఆ కొద్దిపాటి బరువు కూడా ఒక బియ్యపుబస్తాతో సమానంగా వుంది. పైగా ఇక్ష్వాకుల కాలంనాటి చెప్పులు ఉంగటం తెగిపోయి, వదులైపోయి, అడుగుతీసి అడుగేయడం కష్టంగా వుంది.

అప్పటికి రెండుసార్లు అడిగినా కొడుకు చెప్పిన సమాధానం సంతృప్తి నివ్వకపోవడంతో మరోసారి "ఈ కొత్తరూటు ఎందుకురా నాయనా? ఎప్పుడూ వెళ్ళే దారిలోనే తీసికెళ్ళొచ్చుగా'' అంది భయంభయంగానే.

''ఎటైనా ఒకటేలే'' పొడిగా బదులు చెప్పాడతను.

ఎంతోకాలంగా కీళ్ళనొప్పులతో బాధపడ్తోన్న వెంకటమ్మ 'ఆటోరిక్షా అయినా ఎక్కించొచ్చుగా' అని మనసులో బాధపడి, ఆ మాట పైకి అనే ధైర్యంలేక "ఇంకెంత దూరంరా సూరీ" అంది.

"ఒచ్చేశాంలే.. మాట్లాడకుండా నడువు" అన్నాడు.

చేసేదేంలేక నడక సాగించింది వెంకటమ్మ.

ఒక రెండంతస్తుల బిల్డింగ్ ముందుకి రాగానే సూర్యప్రకాష్ ఆగాడు. వెనగ్గా నడుస్తోన్న వెంకటమ్మ కొడుకుని చేరుకుంది. ఆవిడకి అలసటగా వుంది. పమిటకొంగుతో చిరుచెమటలు తుడుచుకుంది. విపరీతమైన దాహంతో నాలుక తడారిపోతోంది.

'కొడుకు చిన్నగా వున్నప్పుడు ఎక్కడికి తీసికెళ్ళినా నిమ్మకాయ సోడా వాడికిష్టమని పనిమాలా తాగించేది. ఈ వయసులో, పైగా రోగిష్టితల్లిని ఇంతదూరం నడిపించాడే.. ఏమైనా తాగించకూడదూ?! అదే తన కొడుక్కయితే తాగించడా?' అనుకుంది.

కానీ సోడాగురించి ప్రస్తావించడానికి జంకి

"నోరు పిడచకట్టుకుపోతోందిరా సూరీ, కాసిని మంచినీళ్ళు..."

అంటూ నసిగింది, ఎక్కడ కసురుకుంటాడోనని భయపడ్తూ.

"లోపలికెళ్ళి వాళ్ళనడుగు, మంచినీళ్ళు ఇప్పిస్తారు. తర్వాత అక్కడే కూర్చో. నాకాస్త పనుంది, వెళ్ళొస్తాను. ఇదిగో ఇది నీ దగ్గరుంచు" అంటూ కళ్ళజోడు వుంచే లెదర్‌కేస్ తల్లి చేతికందించాడు.

"నువ్వెంత సేపట్లో వస్తావు?" అడిగిందావిడ.

"ఏమో, ఒక అరగంట పట్టొచ్చు. సరేనా.. మరి నే వెళ్ళిరానా?" అన్నాడు.

ఆవిడ అలాగేనన్నట్లు తలాడించింది.

రెండు క్షణాలు తల్లిముఖంలోకి చూసి "ఇక్కడెందుకు, లోపలికి పద.. జాగ్రత్త" అని ముందుకి నడిచాడు.

వెంకటమ్మ కొద్దిగా తెరిచున్న గేటులోంచి లోనికి దారితీసింది. కాంపౌండ్‌వాల్ దగ్గర్నుంచీ వరండావరకూ వున్న ఖాళీస్థలంలో పూలమొక్కలూ, క్రోటన్సూ వున్నాయి. వరండా మెట్లమీద దాదాపు వెంకటమ్మ వయసున్న ఇద్దరు మహిళలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు తనవంక కుతూహలంగా చూస్తోంటే "కాసిని మంచినీళ్ళు ఇప్పిస్తారా?" అనడిగింది.

వాళ్ళలో ఒకావిడ లేచి పక్కనే వున్న గదిలోంచి ఒక జగ్గుడు నీళ్ళు, ఖాళీగ్లాసు తెచ్చి, గ్లాసులోకి నీళ్ళు వంపి ఇచ్చింది.

అవి గటగటా తాగేసి మళ్ళీ పోయించుకు తాగి సేదతీరింది వెంకటమ్మ.

"బాగా అల్సిపోయినట్లున్నారు?'' అంది నీళ్ళిచ్చిన స్త్రీ.

"అవునమ్మా, చాలా అలసటగా వుంది. మా పెద్దబ్బాయి వాళ్ళింటికి వెళ్తున్నాం. చిన్నబ్బాయితో కలిసొచ్చాను. వాడికి ఈ దగ్గర్లో ఏదో పని వుందట, అరగంటలో వస్తానని చెప్పి వెళ్ళాడు'' అంది వెంకటమ్మ.

తమపక్కన కూర్చోమన్నట్లు చూశారు. ఆవిడ కూర్చున్నాక ఇందాక ఆగిపోయిన కబుర్లు తిరిగి మొదలుపెట్టారు వాళ్ళు.

ఈవిడెవరో కొత్త వ్యక్తి తమ ఊసులు వింటుందన్న మొహమాటమో, వెరపో వాళ్ళలో లేదు.

"మా అబ్బాయి మంచివాడే సీతమ్మా. కోడలుంది చూశావూ అది నిజంగా రాక్షసి. వాడిని కీలుబొమ్మ నాడించినట్లు ఆడిస్తుంది. దానికీ ఓ కొడుకున్నాడు. వాడికీ పెళ్ళవుతుంది. అప్పుడు తనకీ నాకు పట్టిన గతే పడ్తే?"

"సర్లే సుందరమ్మా, బయటి నుంచొచ్చిన కోడళ్ళనే తప్పుపడ్తాంగానీ కడుపున పుట్టిన కొడుకులు సరైనవాళ్ళయితే వాళ్ళేం చేస్తారు?"

"వండిపెట్టేది వాళ్ళే గనుక వాళ్ళెట్టా చెప్తే అలా వింటారు. నా కొడుకు ఉత్త పిరికిసన్నాసమ్మా"

"అసలు సంగతి అది కాదులే, ముసలి తల్లిదండ్రుల్ని వదిలించుకోడానికి పెళ్ళాన్ని సాకుగా చూపిస్తారు"

సీతమ్మ ఆ అభిప్రాయం తప్పన్నట్లు తలాడించి "తమకి ఏ ఇబ్బంది కలిగినా, అసౌకర్యంగా వున్నా పెళ్ళామ్మీద జులుం చేసేవాళ్ళు పిరికివాళ్ళా?! ముసలివాళ్ళు ఎటూ వెధవపీడే ననుకుని పెళ్ళాం ఏంచేసినా ఊరుకుంటారు..."

అలా వాళ్ళ సంభాషణ ఎంతకీ తరగడంలేదు. వెంకటమ్మకి వాళ్ళ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. తనకీ కొడుకులు, కోడళ్ళపట్ల కొండంత అసంతృప్తి వుండటాన వాళ్ళతో మమేకం చెందింది.

అంతలో ఒక యాభయ్యేళ్ళ వ్యక్తి లోపలినుండి వరండాలోకొచ్చి, వెంకటమ్మ నుద్దేశించి "ఎవరికోసం వచ్చారు?" అనడిగాడు.

అక్కడే వున్న సీతమ్మ రెండుముక్కల్లో విషయం చెప్పి, ఆఫీసుగదిలో వున్న గోడ గడియారాన్ని చూసి "అరగంట దాటింది, మీ అబ్బాయి ఇంకా రాలేదే?" అంది, ఇటు తిరిగి.

"నేనూ అదే చూస్తున్నాను" అంది వెంకటమ్మ.

''లోపల కుర్చీలో కూర్చుంటారా?'' అడిగాడాయన.

"అక్కర్లేదయ్యా, ఇక్కడ బాగానే వుంది"

"మీరిద్దరూ వెళ్ళి భోజనం చేయండమ్మా"

"అలాగే రాజయ్యగారూ" అని ఆ ఇద్దరు స్త్రీలూ లోనికెళ్ళారు.

రాజయ్య ఏదో పుస్తకం చదువుకుంటూ పక్కగా వున్న అరుగుమీద కూర్చున్నాడు.

❋ ❋ ❋ ❋

సీతమ్మ, సుందరమ్మ భోజనాలు చేసొచ్చారు.

రాజయ్య పుస్తకంలో ఒక అరవై పేజీలు చదివాడు.

అప్పటికీ వెంకటమ్మ కొడుకు రాలేదు. వాళ్ళేం అంటారో, అనుకుంటారోనని ఆవిడకి తెగ బాధగా వుంది. తల కొట్టేసినట్లుంది.

రాజయ్య "మీ అబ్బాయికి ఏం పని తగిలిందో... మీరేమైనా తినొచ్చారా? లేకుంటే ఇక్కడ తినండి" అన్నాడు.

"వద్దయ్యా, నేను తినే బయల్దేరాను'' కృతజ్ఞతాసూచకంగా చెప్పింది.

రాజయ్య పుస్తకం పక్కనపెట్టి ఆవిణ్ణి గురించి క్లుప్తంగా తెలుసుకున్నాడు. సీతమ్మ కూడా కల్పించుకుని మాట్లాడసాగింది.

సాయంత్రమైంది కానీ కొడుకు రాలేదు. వెంకటమ్మలో విసుగు కోపంగా, కోపం దుఃఖంగా మారింది. కొడుకుకేమైనా ప్రమాదం

జరిగిందేమోననే శంకతో విలవిల్లాడ్తూ అదే చెప్పింది.

"అలాంటిదేం జరగదు, మీరు స్థిమితంగా వుండండి" అన్నాడు రాజయ్య.



"అవునూ మీ ముఖాన కళ్ళజోడు లేదు, చేతిలో ఆ కళ్ళజోడు పెట్టేమిటి?" అనడిగాడు మళ్ళీ.

"ఇదీ... మావాడు పట్టుకోమని ఇచ్చాడు"

"అందులో ఏముందో ఒకసారి చూడండి"

ఆవిడ తెరిచి చూస్తే అందులో వందనోట్లు ఐదున్నాయి.

రాజయ్య నిట్టూరుస్తూ నవ్వి "మీవాడు దాన్ని పట్టుకోమని ఇవ్వలేదు, మీకే ఇచ్చాడు. ఐదొందల రూపాయలంటే మాటలా?" అన్నాడు వీలైనంతవరకూ అవహేళన ధ్వనించకుండా.

వెంకటమ్మకి వెన్నులోంచి వణుకు పుట్టింది.

"అంటే ఈ డబ్బిచ్చి నన్నిక్కడ వదిలేసి పోయాడా? ఇక మళ్ళీ రాడా?" నిండా భయంతో కంపించిపోతూ అడిగింది.

"మీరు చెప్పిన సమాచారం ప్రకారం మీ పెద్దకొడుక్కి, కోడలికి మీ ఉనికి గిట్టదు. మీ చిన్నబ్బాయి తన భార్య పోరుతో మిమ్మల్ని బయల్దేరదీశాడు గానీ బహుశా అన్నావదినలు తమ దగ్గరికి తేవొద్దని చెప్పి వుండొచ్చు. ఏదేమైనా ఒక ప్లాను ప్రకారం మిమ్మల్నిక్కడ దిగబెట్టి వెళ్ళాడు" తాపీగా అన్నాడు రాజయ్య.

"కానీ, ఇప్పుడు నేనెక్కడికని వెళ్ళాలి? నాలాంటివాళ్ళకి చావైనా రాదే?" ఏడుస్తూ తల పట్టుకుంది వెంకటమ్మ.

"ఎక్కడికెళ్తారు, ఇక్కడే వుండండి"

"మీరెవరో నాకు తెలీదు. కాస్తంత దాహం తీర్చుకోడానికొచ్చాను. దారేపోయే తద్దినాన్ని తెచ్చి పెట్టుకున్నట్లు నన్ను మీరు వుండమన్నా నాకు మనసొప్పాలి కదయ్యా"

"అలా అనకండి... మీలాంటివాళ్ళకోసమే కదా ఈ వృద్ధాశ్రమం వుంది"

వెంకటమ్మ చిత్రంగా చూసింది. అప్పటివరకూ అదో ఇల్లనుకుంటోంది. వాళ్ళు ముగ్గురూ ఒకరికొకరు ఏమౌతారో అనుకుంది.

'అంటే సూరి తననిక ఇందులోనే వుండమని వెళ్ళాడన్నమాట. మాట మాత్రం చెప్పకుండా ఇలా చేస్తాడా? ఎన్ని కష్టాలుపడి ఎంత చాకిరీచేస్తే వాడు ఇంతవాడయ్యాడు? పెద్దవాడు ఎటూ చూడడు. కనీసం వీడు ప్రేమని వంచకపోయినా పంచనుంచుకుని పట్టెడన్నం పడేస్తాడనుకుంది. కానీ తనందుక్కూడా నోచుకోలేదన్నమాట' అనుకునేసరికి వెంకటమ్మకి హృదయాన్ని రంపంతో కోస్తున్నట్లయింది.

''దిగులుపడబాకమ్మా, వేమూ మీలాంటివాళ్ళమే. లోపలింకా చాలామంది వున్నారు. అంతా ఒకే జాతివాళ్ళం. పిల్లలుండీ లేనివాళ్ళం" అంది సీతమ్మ.

''నా కొడుకిలా రోడ్డుమీద వదిలి వెళ్ళిపోయాడంటే నమ్మలేకపోతున్నాను" అంటూ ఏడ్చింది.

"ఇప్పటివరకూ వాళ్ళ వాళ్ళ పిల్లలొచ్చి మాకు ఏవో సాకులు చెప్పి, తమవాళ్ళని అప్పగించి వెళ్ళారు. మీ అబ్బాయి నాలుగాకులు ఎక్కువ చదివినట్లున్నాడు, లోపలికైనా రాకుండా బయటే దిగబెట్టి వెళ్ళాడు" అన్నాడు రాజయ్య.

''ఈ పిల్లలింత కసాయిగా ఎలా వుంటారయ్యా? ఈ ముసలితనంలో నేనెంత తింటానని? నాకు పెట్టే గుప్పెడు మెతుకులు వాడికి తక్కువౌతాయా?" వెంకటమ్మ జీరగొంతుతో అడిగింది.

"కొన్ని ప్రశ్నలకి బదులుండదమ్మా" అన్నాడు రాజయ్య.

"పదిమంది పిల్లలున్నా తల్లికి భారం కారు.. వున్నదాన్ని అందరికీ పంచిపెడ్తుంది. కానీ ఆ పదిమందీ కలిసి కూడా ఒక్క తల్లిని సాకడానికి ఏడుస్తారు" అంది సీతమ్మ.

"వాడి జీతం పదహారువేలని ఎవరో చెప్పగా విన్నాను. ఇప్పుడు నన్నొదిలించుకోడానికి ఐదొందలు ఖర్చుపెట్టాడు" విరక్తిగా చూసింది ఆ డబ్బువంక.

"ఐదొందలైనా ఇచ్చాడు సంతోషించమ్మా"

''వద్దయ్యా.. ఈ డబ్బు... ఇంత విశ్వాసఘాతకుడిచ్చిన డబ్బు నాకొద్దు... నేను బరువులెత్తలేను గానీ, అన్నీ అందుబాటులో వుంటే వంట బాగానే చేయగలను. అలా చేయించుకుని నాక్కాస్త తిండి పెట్టండయ్యా" పెల్లుబికి వస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటూ బొంగురుపోయిన గొంతుతో అంది వెంకటమ్మ.

అక్కడున్న ముగ్గురూ ఆమెవంక ఆర్ద్రంగా చూశారు.

❋

సెన్సూ కామన్ సెన్సు

రుక్మిణి

"అన్నయ్యా...! ఆయన మరీ చెడిపోయారు. ఎలా బతకాలో ఏమో...! రేపు ఎలాగైనా 'మామ్నూరు' తీసుకుపోవాలి. కాస్త నువ్వు సెలవుపెట్టి తోడుగా రావాలన్నయ్యా...!" అంటూ జలజ కన్నీళ్ల పర్యంతమయింది. విషయం అర్థంగాక నేను బిత్తరపోయాను.

జలజ నాకు దూరపు బంధువు. వరసకు చెల్లెలవుతుంది. ఆమెకు ముగ్గురు పిల్లలు. భర్త ఎమ్మీవో ఆఫీసులో క్లర్కు. మనిషి బాగానే ఉంటాడు. పేరు చలపతి. సంవత్సరం కిందట చలపతి సెక్షన్ మారాడు. లోన్ల శాంక్షను, ప్రాసెస్ వంటి బయటి రాబడి వచ్చే సెక్షన్లో వచ్చిపడ్డాడు. జీతంగాక నెలకు ఐదారువేలపైనే 'గీతం' ముడుతోంది. సూచాయగా విషయం తెలిసినమీదట ఓరోజు బజార్లో కనిపిస్తే అతన్ని పలకరించాను.

"ఏం బావగారూ... అలా వెళదాం కొంచెం కంపెనీ ఇవ్వండి. రెండుగ్లాసుల బీరు తీసుకుందురు గానీ" అని ఆహ్వానించాడు.

అతడితో విషయం మాట్లాడటానికి ఏకాంతం కావాలి. అదే మంచి ప్రదేశం. ఇంటికి రమ్మంటే ఎట్లాగూ రాడని "నీకు కంపెనీ ఇస్తా... మాట్లాడే పని కూడా ఉంది. కానీ ఒక షరతు... నేను కూల్‌డ్రింకు మాత్రమే తీసుకుంటా"నన్నాను.

మొదట తటపటాయించినా చివరకు 'సరే' అన్నాడు చలపతి. లోపలకెళ్లి కూర్చున్నాం.

"చూడు చలపతీ... నువ్వు రెండు ప్రమాదకరమైన దారుల్లో ప్రయాణిస్తున్నావు. ఒకటి మామూళ్లకు అలవాటు పడటం. రెండోది ఏనాడూలేని ఈ 'డ్రింకు' అలవాటు. మొదటిదానివల్ల నీ ఉద్యోగానికే ప్రమాదం. రెండోది నీ కుటుంబాన్ని బజారున పడేస్తుంది. ఆలోచించు" అన్నాను.

మందు మార్పించే మందు

చలపతి తేలిగ్గా నవ్వేసి ఊరుకున్నాడు.

మరో ఆర్నెల్లకు చలపతి 'జలగపీకుడు' పైదాకా పోయింది. సస్పెండ్ చేయకుండా దయతలచి సెక్షన్ మార్చారు. చిల్లిగవ్వయినా దొరకని సెక్షన్లోకి షిఫ్ట్ చేశారు. కానీ తాగుడలవాటు మాత్రం మానలేదు. జీతం డబ్బులతో 'బారు' మెయింటెయిన్ చేయలేడుగాబట్టి నాటుసారాకు ఎగబడి ఊరుచివర్న గుడిసెల్లో దూరి 'కాయలు' లాగించడం అలవాటు చేసుకున్నాడు.

ఇంటికి తూలుకుంటూ వచ్చి 'షూ' తీయకుండా... ఏమీ తినకుండా పడిపోవడం... పడుకోవడం... ఆఫీసు ఎగ్గొట్టడం... జీతం కటింగ్... మెమోలు... వగైరా... మామూలైపోయాయి.

మామ్నూరులో తాగుడు మానేయడానికి ఎవరో మందు ఇస్తారని జలజకు వాళ్ల పాలమ్మి కమలమ్మ చెప్పింది. "అక్కడెవరో మందిస్తారట. ఆ మందుగానీ తాగితే ఇక జన్మలో ఈ సారా... బీరుకాయల జోలికి పోరట. అసలు ఈ వాసన వస్తేనే వాంతవుతుందట. చాలామంది అక్కడిచ్చే మందుతాగి తాగుడు మానేశారట. నీకు పుణ్యముంటుంది వెళదామన్నయ్యా..." అని ప్రాధేయపడుతూ అడిగింది. మొదట వద్దని వారించినా చివరకు సరేనన్నాను.

నాకు ఆశ్చర్యమేసింది. ఇలాంటి వాటిక్కూడా పసర్లూ... చిట్కాలూ... నాటు మందులూ... ఉంటాయా! ఇంట్రస్టింగ్. చూద్దాం.. అనుకుని సరే వెళదామన్నాను.

మర్నాడు చలపతిని వెంటబెట్టుకుని నేనూ, జలజా మామ్నూరు వెళ్లాం. అక్కడ చాలా హడావుడిగా ఉంది. మందు వేసే అతను మల్లయ్యగారు. హెడ్‌కానిస్టేబుల్‌గా చేసి రిటైరయ్యాడు. జనం చాలామందే ఉన్నారు. నేను వివరాలు సేకరించాను. లోకంలోని సమస్తరకాల రుగ్మతలను నివారించే నిలయమని చెప్పారు. ఇల్లు బాగోలేకపోవడం... పిల్లలు లేకపోవటం... చికాకులు... జ్వరాలూ... దగ్గులూ... చేతబడులు... గాలి సోకుట... దెయ్యాలుపట్టుట... అబ్బో గిరాకీ బాగానే ఉంది.

ఇరవై రూపాయలిచ్చి టోకెన్ తీసుకున్నాం. రెండుగంటల తర్వాత మా వంతు వచ్చింది. లోపలతను చలపతి చేతికి ఓ తావీదు కట్టాడు. అందరికీ అలాగే కడుతున్నాడు. అన్నీ ఒక కుప్పలోనివే. సగం విస్కీ ఉన్న సీసాలు తెప్పించి దానిలో ఏదో బూడిద కలిపాడు.

"చూడు బాబూ చలపతీ... ఇపుడిది తాగు. అనంతరం ఈ తమల పాకులు నములు... దాన్నిండా మూలిక లున్నయ్. అంతే...! తర్వాత నువ్వు బ్రాందీ, విస్కీ, రమ్ము, సారా, కల్లు, గుట్కా ఏదైనా తాగినా, తిన్నా ముందు నీకాళ్లూచేతులూ పడిపోతాయి. ఒకనెలలో పాడెకట్టడం ఖాయం!" అని బోధచేసి తాగించి తాంబూలమిచ్చాడు. చిన్న చీటీలపై ఏదో గిలికి వాటికి రోజూ ఏదో ధూపం వేయమన్నాడు. కొంత డబ్బు చెల్లించి బయటపడ్డాం. జలజకు మహదానందంగా ఉంది.

బస్టాండు దగ్గర మాకో వ్యక్తి తారసపడ్డాడు. మనిషి కొంచెం వికారంగా ఉన్నాడు. 'హ్హహ్హహ' అంటూ నవ్వి "గా మల్లయ్య మందు తాగిపించడానికి పట్టుకొచ్చిండ్రా సారూ!" అని వెకిలిగా అడిగాడు.

"అవును...!" అన్నానేను. మళ్ళీ అలాగే నవ్వుతూ..."నేను గీ యేడాది ఇప్పటికి ఐదుసార్లు ఆ మందు తాగినా... తాగినంక ఒక్కనెలరోజులాగి బుడ్డిమందు షురూ జేసినా" అన్నాడు. ఆ మాటలకు జలజ మొహం వాడిపోయింది.

"మరి నీకేం కాలేదా?" అనడిగాను.

"సుబ్బరంగానే ఉన్నా" అంటూ అతడు రాగం తీసుకుంటూ వెళ్ళిపోయాడు. సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాం.

"చూడు జలజా... చలపతీ, నువ్వు కూడా విను... వ్యసనాల్ని ఆహ్వానించేది మనమే. వద్దనుకుంటే వాటిని తరిమి కొట్టాల్సిందీ మనమే... అందువల్ల వాటికీ మనకీ మధ్య ఏ మందులూ... మంత్రాలూ పనిచేయవు. కావలసింది గుండె నిబ్బరమూ, పట్టుదలా, మనోసంకల్పమూనూ. అన్నింటికీ మించి ప్రాణం మీద తీపి, కుటుంబం మీద ప్రేమా... అంతేతప్ప మందులూ, మాకులూ ఏమీ చేయలేవు"

చలపతి శ్రద్ధగానే విన్నాడు... ఏంచేస్తాడో చూడాలి మరి...!

*





వకుళాభరణం రామకృష్ణ

(సాహిత్యంలో అరుణతార

('కె.వి.ఆర్. సాహిత్య రచనలలో సామాజిక, రాజకీయ దృక్పథం-ఒక విశ్లేషణ', డా॥ లక్ష్మీసుహాసిని, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, పుటలు: 214)

ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ సాహిత్యోద్యమాలతో సంబంధం కలిగి మార్క్సిస్టు విమర్శకుడిగా పదుగురికీ పరిచయమైన కవి, రచయిత, నాటకకర్త కె.వి.ఆర్ పూర్తిపేరు కె.వి.రమణారెడ్డి. వృత్తిరీత్యా చరిత్ర, రాజకీయశాస్త్రాల్లో అధ్యాపకుడైనా చరిత్ర, సాహిత్యాలే ఆయన ప్రాణం. అధ్యాపకుడిగా మంచిపేరు గడించినా, సాహిత్యాన్ని సాహిత్యోద్యమాలను తన ప్రధాన కార్యరంగాలుగా ఎన్నుకున్నాడు. విద్యార్థిదశ నుండి వామపక్ష భావాలు కలిగి, తుదిశ్వాసదాకా ఆ భావాలకే కట్టుబడి ఉన్నాడు.

కె.వి.ఆర్‌కు పఠనాశక్తి ఎంతగా ఉండేదో, అంతకంటే మంచి పఠనాంశాలు రాశాడు. పుస్తకాల పురుగుగా సామాజికశాస్త్రాల్లో వచ్చే గ్రంథాలను క్రమంతప్పకుండా చదివేవాడు. కవిగా గేయాలను, గేయవ్యాసాలను, కొన్ని నాటకాలను రాసినా, ప్రధానంగా కె.వి.ఆర్ జీవిత చరిత్రకారుడిగా, విమర్శకుడిగానే ఖ్యాతినార్జించాడు. కె.వి.ఆర్ రాసింది అచ్చులో కొన్నివేల సంపుటాలకు మించిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. కె.వి.ఆర్ శ్రమపడిపోగుచేసుకున్న వ్యక్తిగత గ్రంథాలయం పరిశోధనలకు కోశాగారంలా పనికొచ్చేది. కె.వి.ఆర్ మందిలో మనిషికాడు. అంతమాత్రంచేత తనకు నచ్చిన, తానుమెచ్చిన మిత్రులకు ప్రాణమిచ్చే స్నేహపాత్రుడు. మాట కటువు. మనసు మెత్తన. పరోపకారి.

ప్రస్తుతం పరీక్షిస్తున్న గ్రంథం, కె.వి.ఆర్ సాహిత్యరచనలపై డాక్టర్.లక్ష్మీసుహాసిని రాసిన పరిశోధనా సిద్ధాంత గ్రంథం. నిజానికి కె.వి.ఆర్ రాసిన అసంఖ్యాక రచనలగూర్చి విశ్లేషించడానికి పూనుకోవడమే ఒకవిధంగా సాహసం. ఎందుకంటే ఆయన రాసిన వ్యాసాలు (గ్రంథరూపంలో వచ్చినవి సరే) తెలుగులో వచ్చిన అనేకానేక పత్రికల్లో వెలువడ్డాయి. వాటిని వెతికి పట్టుకోవడమే ఒక పరిశోధన. అయితే, లక్ష్మీసుహాసిని ఈ సిద్ధాంత గ్రంథాన్ని రాసేముందు ఆయన రాసిన రచనలన్నింటి గురించీ వివరాలు సేకరించి ఒక సూచికం(ఇండెక్స్), "కె.వి.ఆర్ సాహిత్య కరదీపం"(1999) ప్రచురించింది. దీంతో సగం పరిశోధన పూర్తయినట్టే కదా! ఇక, ఈ పరిశోధనా కాలంనాటికి కె.వి.ఆర్ జీవించేవుండటం పరిశోధకురాలికి బాగా కలిసొచ్చింది. రాసినవన్నీ ఆయనెంతో జాగ్రత్తగా భద్రపరిచేవారు. అవి సుహాసినికి లభ్యమయ్యాయి. దీంతోబాటు కె.వి.ఆర్‌ను సుహాసిని అనేకసార్లు వివరంగా ఇంటర్వ్యూలు చేశారుకూడా. కె.వి.ఆర్ మిత్రులు, ఆప్తులకు ఒకప్రశ్నావళి పంపి, కె.వి.ఆర్ రచనలపై, వ్యక్తిత్వంపై, భావాలపై విలువైన సమాచారాన్ని రాబట్టారు. ఇంత శ్రమలోంచి వెలువడింది కాబట్టే, ఈ గ్రంథం వీలున్నంతలో సమగ్రతను సంతరించుకుంది.

ఈ గ్రంథంలో ఆరు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయాన్ని జీవితరచనా విశేషాలతో ఆరంభించి తర్వాత నాలుగధ్యాయాల్లో కె.వి.ఆర్ సాహిత్య సృష్టిని పరామర్శించి, ఆఖరుదైన ఆరవ అధ్యాయంలో సామాజిక, రాజకీయ దృక్పథాన్ని విశ్లేషించారు. అనుబంధాల్లో ప్రధానంగా ఉపయుక్త గ్రంథాల పట్టికను చేర్చారు. సుహాసిని అధ్యయనంలో ప్రధానంగా చెప్పుకోదగిన అధ్యాయం జీవితచరిత్రలకు సంబంధించినది. విమర్శకులు ఇంతవరకూ వ్యక్తీకరించని అనేక నూతనాంశాలను చేర్చి 'చారిత్రక పరిణామక్రమంలో కవిని భాగంగా చూడాలేకానీ, పరాయిగా కాదని చెబుతూ, కె.వి.ఆర్ రాసిన జీవితచరిత్రలకు ఈ ధోరణి 'బలమైన తార్కికత'ను చేకూర్చిందన్నారు. వివిధ ప్రక్రియలన్నింటినీ అధ్యయనాల్లో చేర్చడంవల్ల స్పష్టత లోపించింది. ఆఖర్లో ఒక్కమాట. కె.వి.ఆర్ సాహిత్యంలో ఏదో ఒక ప్రక్రియను అలవరచుకుని పరిశోధన చేస్తే, ఆ కృషి చక్కగా ఉండి సమగ్రతను సమకూర్చుకునేదనిపించింది. తలకుమించిన భారాన్నెత్తుకుని శ్రమకోర్చి, పరిశోధనలో పట్టుసాధించిన లక్ష్మీసుహాసినిని అభినందనీయురాలు.

❋



మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్: 9849130141

ఎప్పుడెప్పుడు ఎలా జాగ్రత్త పడాలి?

చాలామంది తల్లిదండ్రులు 'మన పిల్లల గురించి మనకు తెలీదా ఏంటి?' అనుకుంటూంటారు. కన్నవాళ్ళు కాబట్టి వారి పోకడ పూర్తిగా తమకు తెలుసునని భావిస్తారు. వారి మనస్తత్వం తమ మనస్తత్వానికి బాగా దగ్గరగా వుంటుందని విశ్వసిస్తారు. వారు తమ అంచనాలకు ఏమాత్రం భిన్నంగా వ్యవహరించబోరని నమ్ముతారు. తమ ఆలోచనలకు భిన్నంగా వాళ్ళు నడుచుకోరనుకుంటారు. తీరా పిల్లల ప్రవర్తన తమ ఆలోచనలకు భిన్నంగా ఉండేసరికి తల్లడిల్లిపోతారు. ఇతంతా కాల మహిమని, జనరేషన్ పూర్తిగా పాడయిపోయిందని అంటారు. ఆ పరిణామాన్ని తట్టుకోలేరు. చెప్పలేనంత ఉక్రోషం ముంచుకొస్తుంది. దారీతెన్నూ కనబడక కఠినంగా శిక్షించడమొక్కటే సరయిన మార్గం అనుకుంటారు.

ఈ సమస్యను మరో కొత్త కోణంలోంచి పరిశీలించవల్సివుందన్న సంగతి వారికి తెలీదు. మనస్తత్వశాస్త్రంతో పరిచయం లేకపోవడం, ఇటువంటి సమస్యలతో సతమతమయ్యే ఇతర కేసుల గురించి తెలిసే అవకాశం లేకపోవడం వంటి కారణాలరీత్యా అవగహన కొరవడ్తుంది. విపరీతమైన సమస్య ఏదైనా ఎదురైనప్పుడు సంబంధిత శాఖల్లో పరిజ్ఞానం, అనుభవం కల్గిన వ్యక్తుల సహకారం తీసుకోవడం తప్పనిసరి. అయితే ఎప్పుడెప్పుడు జాగ్రత్తలు తీసుకోవల్సి వుంటుందనేది తెలుసుకోవడానికి టీనేజ్ పిల్లల మనస్తత్వంపై పరిశోధన చేసిన శాస్త్రజ్ఞులు కొన్ని జాగ్రత్తలు తెలియజేశారు.

మీ పిల్లల విషయంలో ఎపుడు ఎలా జాగ్రత్తపడాలో ఈ క్రింది అంశాలు తెలియచేస్తాయి.

పిల్లల్లో ప్రమాదకరమైన పరిణామాలేవైనా గుర్తించి నట్లయితే, ఈ రంగంలో అనుభవం గల వ్యక్తుల సాయం తీసుకోవాలి. మీకు పిల్లలతో ఎదురైన సంఘటన అంతకు ముందు మీకు పరిచయం లేనిది కావచ్చు. అంతమాత్రాన మీకు ఇందులో పరిజ్ఞానం లేకుండా పోయిందని బాధ పడకూడదు. మీ ఇంటి సమస్యను, ఏమాత్రం సంబంధం లేని ఒక కొత్త వ్యక్తి ఎదుట విప్పి చెప్పవల్సివచ్చిందని బిడియ పడనక్కల్లేదు. నిస్సంకోచంగా కౌన్సిలర్ల సహాయం తీసుకోండి. మీ పిల్లలు ఈ కింది లక్షణాలను కన్పరిస్తే, కౌన్సిలింగ్‌కు వెళ్ళాల్సిన సంకేతంగా భావించండి.

1. మాదకద్రవ్యాలు లేదా ఆల్కహాలుకు అలవాటుపడడం. 2. గర్భం దాల్చటం 3. గ్రూపులతో కలిసి తిరగటం 4. ఆయుధాలను ఉపయోగించటం

5. క్షుద్రశక్తులపై ఆసక్తి చూపడం 6. ఎప్పుడూ దిగులుగా కన్పించటం 7. సెల్ఫ్-ఎస్టీమ్ లేకపోవడం 8. తనను తాను ఎక్కువగా నిందించుకోవటం 9. ఆత్మహత్యా ప్రయత్నం చేయటం 10. చట్టవరమైన నేరాలు చేయటం (హింస,దోపిడి,వగైరా) 11. చదువులో బాగా వెనుకబడిపోవడం 12. ఎనోరోక్సియా నెర్వోసా, బులీమియా వంటి లక్షణాలు 13. బరువు కోల్పోతూ వుండడం.

అయితే పైన తెలిపిన లక్షణాలే సమగ్రమైనవని కూడా మీరు భావించరాదు. మీరు హ్యాండిల్ చేయలేమని మీకు అన్పించే ఏ లక్షణం ఎక్కువగా వున్నా మీరు ప్రొఫెషనల్‌హెల్ప్ తీసుకోవాల్సిందే! కనుక మనస్తత్వశాస్త్రం రీత్యా సామాన్య, అసామాన్య దృక్పథాలమధ్య తేడాలు తల్లిదండ్రులుగా మీకు తెలిసుండడం అవసరం. కాబట్టి ఈ క్రింది అంశాలను కూడా దృష్టిలో వుంచుకోండి.

1. పిల్లలు దీర్ఘకాలంపాటు మౌనంగా వుంటున్నారా? 2. సామాజిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాలుపంచుకోకుండా, స్నేహితులు లేకుండా ఒంటరిగా వుంటున్నారా? 3. తరచూ పరీక్షల్లో తప్పుతున్నారా? 4. ఆహారపుటలవాట్లలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారా? 5. తనచేతిని తాను తెగ్గొట్టుకోవటం, కొరుక్కోవటం చేస్తున్నారా? 6. చట్ట వ్యతిరేకమైన చర్యల్లో వుండటం, అరెస్టుకావటం 7. ప్రత్యేకంగా ఏ వ్యక్తికయినా భయపడ్తున్నారా? 8. అలా భయపడేది ఒక బంధువుకా, ప్రేమికునికా?

9. లైంగిక వేధింపుకు గురవుతున్నారా? 10. బాగా సోమరిగా వున్నారా? 11. మీ పిల్లల సమస్యలు మరీ ఆందోళనకరంగా పరిణమించడంవల్ల మీ ఉద్యోగ జీవితం కూడా డిస్టర్బ్ అవుతోందా? 12. కోపం ఎక్కువగా కన్పిస్తోందా? 13. లైంగిక విచలనాలు ఏర్పడ్తున్నాయా? 14. ఎవరో తొంగిచూస్తున్నట్లు, ఎవరో చెవిలో మాట్లాడ్తున్నట్టు భ్రమల గురించేమైనా చెప్తున్నారా? 15. నిద్రలేమి, పీడకలలు, లేదా అతినిద్ర 16. యాంగ్జయిటీ న్యూరోసిస్ లక్షణాలు మొ॥న విషయాల్లో మీకు అనుమానాస్పదంగా కన్పిస్తే వెంటనే సైకలాజికల్ కౌన్సిలర్ వద్దకు వెళ్ళి సంప్రదించాల్సిందే!.

ఈ వ్యాసాలను క్రమం తప్పకుండా చదువుతూ పాఠకులు తమ ఆనక్తిని ప్రదర్శించి నాకెంతో స్ఫూర్తినందించారు. తమ విలువైన అభిప్రాయాలను రాస్తూ ఈ వ్యాస సంపుటి తమకెంతో ప్రయోజనాన్ని అందిస్తోందని ఎప్పటికప్పుడు తెలియజేయ సాగారు. కాగా పలు సమస్యలను చక్కగా వివరించడం జరిగిందని, అయితే సమస్యకు తగిన పరిష్కారం చెబితే మరింత ప్రయోజనకరంగా వుంటుందని కొందరు పాఠకులు అభిప్రాయ పడుతున్న నేపథ్యంలో నాదొక మనవి. ప్రతి సమస్యను చర్చించడమే కాక ఆయా సమస్యలకు సంబంధించిన మేరకు తగిన పరిష్కార మార్గాలను ఇవ్వడం జరిగింది. అయితే ఒక సమస్యను పరిష్కరించేటప్పుడు ఉపయోగించే విధానం అందరికీ సమానంగా ఉపయోగపడు తుందని చెప్పలేం! ఒక్కొక్కరి సమస్యను ఒక్కోవిధంగా పరిశీలించవలసి వుంటుంది. దీన్ని పరిగణనలోకి తీసుకుని రాసినందువల్ల కొంతమందిలో సమస్యలకు తగిన పరిష్కారాలు ఇవ్వలేదేమోనన్న అపోహ ఏర్పడింది. అందుకే ఈ చివరి వ్యాసంలో పాఠకుల సౌకర్యార్థం తమ పిల్లల విషయంలో ఎప్పుడెప్పుడు జాగ్రత్తలు తీసుకోవల్సివున్నదో తెలియజేయడం జరిగింది. మరో ప్రయోజనకరమైన శీర్షికతో తిరిగి కలుద్దాం! ✱

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

సైన్సు-గ్రామాలు

భారతదేశాన్ని తొలిసారి సందర్శించే విదేశీయులు, ముఖ్యంగా పశ్చిమ దేశాలవారు చాలా ఆశ్చర్యపోతారు. మనదేశం గురించి అటువంటివారిని అడిగితే 'ఇది చాలా వైవిధ్యభరితమైన దేశం' అని చెబుతారు. ప్రాంతాలు, భాషలు, ఆచారాలు, సంప్రదాయాలు, రూపురేఖలే కాదు వారికొక వైరుధ్యం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అత్యంత ఆధునికత, అతి ప్రాచీనత... రెండూ వాటి గరిష్ట రూపాల్లో కనిపిస్తాయి. ఈ రెండూ కలిసి కాపురం చేస్తున్న ఏకైక దేశం బహుశా ప్రపంచంలో ఇదొక్కటేనేమో.



బెంగుళూరులోని హైటెక్ ప్రజలు నివసించే కాలనీలకు వెళ్లండి. లేకుంటే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, గచ్‌బౌలీ ప్రాంతాలు చూడండి. అమెరికాలోనో, యూరప్‌లోనో ఉన్నట్లుంటుంది. ఇటీవల ఈ నగరాలను సందర్శిస్తున్న చాలామంది విదేశీయులు ఇదే విషయం చెబుతున్నారు. ఆధునిక దుస్తులతో, మెరిసిపోయే ఆధునిక వాహనాల్లో తిరుగుతూ అన్నిరకాల ఆధునిక పరికరాలు ఉపయోగిస్తున్న ప్రజలు కనిపిస్తారు. ప్రపంచంలో అప్పుడే ఉత్పత్తి అయిన ఏ వస్తువైనా వీరివద్ద ప్రత్యక్షమౌతుంది. ఐటీరంగంలో పాశ్చాత్యులకే పాఠాలు చెప్పగలవారు. ప్రపంచంలో ఎక్కడా లేని వైద్య సదుపాయాలు, సరికొత్త సాంకేతిక వస్తువులు, అంతర్జాతీయస్థాయి చదువులు, శాస్త్ర-సాంకేతిక రంగాల అభివృద్ధిని అన్నివిధాలా అందిపుచ్చుకున్న జీవితాలు వీరివి.

అదే సమయంలో కాస్త నగరాలు దాటి అలా గ్రామాల్లోకి ప్రవేశించండి. వేల సంవత్సరాల క్రితం మానవులు ఉపయోగించిన ఎడ్లబండ్లు ఇప్పటికీ దర్శనమిస్తాయి. ఎడ్లబండ్లు సరే ఆ బండ్ల సాంకేతిక పరిజ్ఞానం కూడా వేల ఏళ్లనాటిదే. కొన్నివేల సంవత్సరాల క్రితం మానవుడు ఆహారాన్ని ఎలా వండుకు తినేవాడో ఇప్పుడూ ప్రజలు అదే పద్ధతిలో కట్టెలు, పిడకలు తగలబెట్టి మట్టికుండల్లో వంటచేస్తూ కనిపిస్తారు. మానవజాతి ప్రాచీనకాలంలో నివసించినట్లే చదువుసంధ్యలకు దూరంగా ఉంటారు. తండ్రినుండి కొడుకు, తల్లినుండి కూతురు చూసి పనులు నేర్చుకునే పురాతన పద్ధతి నేటికీ అమలవుతోంది. రోగాలు వస్తే నేటికీ వారు ప్రాచీనకాలం నాటి పద్ధతుల్లో వైద్యం చేయించుకుంటారు. ప్రాచీనకాలపు వైద్యంలో మూలికా వైద్యం ప్రధానమైంది. దానికి తోడు తమకు అర్థంకాని చాలా జబ్బులకు వారు దేవుళ్లను, దయ్యాలను, మంత్ర తంత్రాలనూ ఆశ్రయిస్తున్నారు. ఇదే ఇప్పుడు చాలా గ్రామాల్లో వైద్యం. ఇక రాళ్లు రప్పలనూ, చెట్టూపుట్టలనూ, పాములువృక్షాలనూ పూజించడం పూర్వంలాగే నేటికీ పల్లెల్లో కనిపిస్తుంది. మన పల్లెలన్నీ ఇలాగే ఉన్నాయని కాదు. ఆధునికతను సంతరించుకుంటున్న పల్లెలు లేవని కాదు. ముఖ్యంగా వ్యవసాయ విప్లవం (గ్రీన్ రివల్యూషన్) జరిగిన గ్రామీణ ప్రాంతాలు శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో చాలా పురోభివృద్ధి సాధించాయి. ట్రాక్టర్లు, పంటకోత మిషన్లు వంటి ఆధునిక పరికరాలు ఉపయోగిస్తున్నాయి. ఆధునిక విత్తనాలుపయోగిస్తున్నాయి. ఆధునిక సేద్యపు పద్ధతులూ అనుసరిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించిన అనేక రకాల పరికరాలు ఇక్కడి ప్రజలు ఉపయోగించగలుగుతున్నారు. విద్య, వైద్యం కూడా కొంతవరకు వీరికి అందుతోంది. కాని ఇటువంటి గ్రామీణ ప్రాంతాలు విస్తారమైన మనదేశంలో చాలా కొద్ది మాత్రమే. నూటికి 70 మంది ప్రజలు నివసించే గ్రామీణ భారతంలో పైన చెప్పిన ప్రాచీన పద్ధతిలో, ఆధునిక శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగా నివసిస్తున్నవారి సంఖ్యే ఎక్కువ.

ఇరవై ఒకటో శతాబ్దంలో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధిచెందిన తర్వాత, మానవుడు అణువునూ, అంతరిక్షాన్నీ జయించి వాటిని తనకు బానిసలుగా మార్చుకుంటున్న తరుణంలో, ఇంటర్నెట్, డిజిటల్ విప్లవం మానవుని జీవితవిధానాన్ని సమూలంగా మార్చేస్తున్న ఈ కాలంలో కూడా ఇంకా వేలాది ఏళ్లకు పూర్వం నివసించే జీవనవిధానంలో అత్యధిక భారతీయులు ఎందుకుంటున్నారు? ఈ ప్రశ్నకు మనం సమాధానం చెప్పాలి. ఎవరికి వాళ్లం చెప్పాలి. సామూహికంగా అందరం కలిసి చెప్పాలి. ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం సుమారు 60 ఏళ్లు దేశాన్నేలినవారు చెప్పాలి. ఎందుకు భారతదేశంలో ఇంతటి ఆధునికత మధ్య అనాగరికపు ఆదివాసీజీవితం గుడుపుతున్నవారు అత్యధికంగా అలాగే ఉండిపోయారు?

ఆధునిక సాధనమైన ఓవెన్‌లో వంటచేసుకునే కొద్దిమంది ఒకవైపు, పిడకలు, పుల్లలతో గుండె పగిలేట్లు పొయ్యి ఊదుతూ వంటచేసేవారు మరొకవైపు ఎందుకున్నారు? అందరికీ ఆధునిక ఓవెన్లు ఇవ్వగల టెక్నాలజీ మనదగ్గరుంది. ఉత్పత్తి చేయడానికి మనుషులున్నారు, నిపుణులున్నారు. అయినా అందరికీ ఓవెన్లివ్వలేరనుకుందాం! వాటిని మరీ విలాసవస్తువులనుకుందాం! కనీసం ప్రల్లెల్లో ప్రతి కుటుంబానికీ పొగరాని పొయ్యిలివ్వలేమా! వండుకోడానికి మట్టి కుండలు మినహా మంచి పాత్రలు ఇవ్వలేమా! తాగడానికి అపరిశుభ్రమైన నీరు మినహా శుద్ధి చేసిన మంచి నీరు ఇవ్వలేమా! ప్రాథమిక స్థాయిలో చదువు చెప్పలేమా! కనీస స్థాయిలో వైద్యం, మందులు అందించలేమా! భారతదేశం అంతగా గొడ్డుబోయిందా? వనరులు లేవా, మనుషులు లేరా?

వైద్యులు గ్రామీణ ప్రాంతాలవైపు వెళ్లరు. శాస్త్రవేత్తలకు గ్రామీణజీవితం చాలా దూరం. పాఠశాలలు ఉండవు, ఉన్నా ఉపాధ్యాయులు ఉండరు. ఉన్నా పాఠాలు చెప్పడానికి కావలసిన సదుపాయాలుండవు. ముఖ్యంగా గ్రామీణప్రాంత ప్రజలకు శాస్త్ర-సాంకేతిక, విద్యా-విజ్ఞానం పరంగా ఏది అవసరమో దాన్ని అందిస్తే అందుకుని పురోగమిస్తారన్న జ్ఞానం పాలకుల్లో లోపించింది. వ్యవసాయం చేయడంలో తోడ్పడే సాంకేతిక పరికరాలను తయారుచేసి, అందివ్వడానికి బదులు వారిని వ్యవసాయం నుండి దూరంచేసే యంత్రాలను ప్రవేశపెడుతున్నారు. దానివల్ల వారిలో ఆధునిక యంత్రాలపట్ల వ్యతిరేకత పెరుగుతుంది.

అయితే గ్రామీణ ప్రాంతాలకు శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకుపోవడానికి అసలు ప్రయత్నం చేయలేదని కాదు. కొన్ని ప్రయత్నాలు జరిగాయి. 1960-70 దశకాల్లో వ్యవసాయ విద్యాలయాలు, వ్యవసాయ పరిశోధనాకేంద్రాలూ నెలకొల్పబడ్డాయి. 1974లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు అనుబంధంగా గ్రామీణప్రాంతాల్లో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం అమలుకు ఒక విభాగం నెలకొల్పారు. వ్యవసాయంలో కొన్ని కొత్త పద్ధతులొచ్చాయి. విద్య, వైద్యం కొంతమేరకు విస్తరించింది. కాని ఇవి ఏమాత్రమూ సరిపోవు. నగరాల్లో వీటి అభివృద్ధితో పోల్చినప్పుడు గ్రామీణప్రాంతాలు ఇంకా ప్రాచీన కాలంలోనే ఉండడం అన్యాయం. 2005లో విడుదలైన ఇండియన్ సైన్సు రిపోర్టు కూడా ఇదే విషయాన్ని చెప్పింది. అందువల్ల ఈ అన్యాయాన్ని తక్షణం రూపుమాపాలి.

పల్లెలు ఆధునికం కావాలి! ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అక్కడికి చేరాలి! ఆ పని ఒక మహోద్యమంలాగా సాగితేనే నగరాలకూ, పల్లెలకూ మధ్య అంతరాలు తగ్గుతాయి! ఈ పని తక్షణం జరగకపోతే దేశంలో త్వరలోనే ఒక పెద్ద సామాజిక సంక్షోభంలో చిక్కుకుంటుంది.

✻

ఖమ్మం జిల్లా కవితా సౌభాగ్యం - గుమ్మం



సామాజిక, రాజకీయ, భౌగోళిక, సాంస్కృతిక రంగాలపరంగా తనకంటూ ఒక ప్రత్యేకను సంతరించుకున్న ఖమ్మం ప్రగతిశీల చైతన్యంతో తొణికిసలాడుతూ ఉంటుంది. సాహిత్యంలో దాశరథి కృష్ణమాచార్య, కౌముది, దాశరథి రంగాచార్య, చేరా, అఫ్సర్, యాకూబ్, ఖాజా, షాజహానా, రావులపాటి సునీత లాంటి అనేకమంది లబ్ధప్రతిష్టులున్న జిల్లా. రాజకీయ చైతన్యం ప్రాతిపదికగా ప్రగతిశీల భావాలతో ఖమ్మం సాహిత్యలోకం తన ప్రత్యేకతను చాటుతుంది. ఆ క్రమంలో ఒక ప్రత్యేక సందర్భంలో వచ్చిందే 'గుమ్మం' కవితా సంకలనం. సాహితీ స్రవంతి ఖమ్మంలో 'చేరా అభినందన సభ' ను పెద్ద యెత్తున నిర్వహించింది. ఆ సందర్భంగా ఖమ్మం జిల్లాలోని మొత్తం కవులందరి నుంచీ సేకరించిన కవితల సమాహారమే 'గుమ్మం'. ఆ సభలో ఆవిష్కరించాల్సిన ఈ పుస్తకం అనివార్య కారణాలరీత్యా ఆలశ్యమయిందని సంపాదకుల మాట. ఏమైనప్పటికీ ఈ కవితా సంకలనం ఒక మంచి ప్రయత్నం. ఆ జిల్లాకే చెందిన ఆంధ్రజ్యోతి ఎడిటర్ రామచంద్రమూర్తి సముచితమైన ముందుమాటతో ప్రారంభమైన పుస్తకం ఆద్యంతం ప్రగతిశీల కవితా సౌరభాన్ని వెదజల్లింది. తెలంగాణా సాయుధపోరాటంలో అమరులైన త్యాగధనుల సాక్షిగా సాహిత్యలోకం చైతన్యవంతమైంది. ఆ పోరాట భావాల స్ఫూర్తి ఈ సంకలనంలో అడుగుడుగునా కన్పడుతుంది.

'హరిభట్టును అలరించిన అందమైన జిల్లా/ దాశరథి కలాన వీర విప్లవాగ్ని మన జిల్లా/ మత మైత్రిని బోధించు సమైక్య వేదిక ఈ జిల్లా' అంటూ ఖమ్మం శీర్షికన కీ॥శే॥ కౌముది రాసిన పంక్తులు స్ఫూర్తినిచ్చేవిగా వున్నాయి. ఈ సంకలనంలోని కవితా వస్తువులు అనేకం. ప్రేమ గురించే రాసినప్పటికీ లోతైన అర్థాన్ని కవి వెతుకుతుంటాడు- 'తనని చూసి నాలో కలిగిన భావం/ ఆత్మీయతకు ఆలవాలమో.../ ఆకర్షణకు ఆలంబనో అని మస్తిష్కం ఆలోచన మొదలు పెట్టింది' అంటాడు. దేని గురించి రాసినా కవుల విస్తృత అవగాహన ఆయా కవితల్లో ప్రతిబింబిస్తుంది. ఖమ్మం జిల్లా వైశిష్ట్యం దగ్గర్నుంచి అంతర్జాతీయ సామ్రాజ్యవాదంపై నిరసన వరకూ కవితా వస్తువులే. మరీ ముఖ్యంగా మతసమైక్యత, మతోన్మాదాల గురించిన కవితలు ఈ సంకలనంలో మనకు ప్రత్యేకంగా కనపడ్తాయి. 'అమావాస్య రాతిరిలో మిణుగురు దీపాల తోవ/ అడుగడుగునా శవాల శకలాల తేమ/ మానవ నెత్తుటిని మధువుగా/ తాగుతున్న మతోన్మాదం/ ఎటుచూసినా గాడ్సేలే కనిపిస్తున్నారు/ గాంధీ పుట్టింది ఇక్కడేనా...!?.(రాం, రహీం! ఎక్కడ మీ చిరునామా?- వి. సునంద) ముస్లిం ప్రజానీకంలో నీడలా పరుచుకున్న అభద్రతాభావం ఈ కవితలో వ్యక్తం అవుతుంది. ఇక ప్రముఖ వర్ధమాన కవియిత్రి షాజహాన తన 'కాలీ దునియాఁ' కవితలో 'బుర్ఖా వేసుకున్నప్పుడు ప్రపంచం నల్లగ అవుపించేది/ బుర్ఖాలను చీల్చేసి... శరీరాల్తో సహా తగలబెడ్తున్నప్పుడు/ బిత్తరపోయిన ప్రాణాలకు ఒక్కసారిగా/ ఈ దునియాఁ మొత్తం/ నల్లగా... ఎండిన రక్తం ముద్దలా/ ఇప్పుడు బురఖా వేసినా వేయకున్నా/ ప్రపంచమంటే - కాషాయ శిల...! కత్తి మొన...!' అంటూ మతోన్మాద తీవ్రతని బలంగా వ్యక్తీకరిస్తుంది. సీరాల అప్పారావు రాసిన 'రాజకీయ లోగో' కవితలో 'మతాల ఆరని మంటలకు మా రాముడొక లోగో' అంటాడు. ఇలా పలు కవితల్లో మతోన్మాదం గురించి కవులు స్పందించిన తీరు పాఠకులకు ఆనందాన్ని కలిగిస్తాయి. ఇదే స్థాయిలో అమెరికా సామ్రాజ్యవాదంపై తీవ్ర నిరసనతో కూడిన కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ముచ్చర్ల ఇబ్రహీం తన 'వర్తమాన సుయోధనుడు' కవితలో 'శాంతికోసం అసత్యపు ఆయుధ తనిఖీ ఓ పాచిక/ వాడు తెల్లచర్మం తొడుక్కున్న/ అశాంతి కపోతం/ వాడు మనుషుల్ని, దేశాల్నే కాదు/ సమస్తాన్ని మింగే ఆధునిక అనకొండ' అంటాడు. గరికపాటి మణీందర్ తన 'దుఃఖఋతువు' కవితలో 'గ్లోబలైజేషన్.../ గ్లోబల్ వార్మింగ్.../ మానవ క్లోనింగ్.../ ఎవరి కాళ్ళకింది మట్టిని/ వాళ్ళే తొలుచుకోండి/ నాగరికత ఉరితాడుకు నవీన రీతిలో వేళ్ళాడండి' అంటూ తన నిరసన గళమెత్తుతాడు.

ప్రత్యేక కవితా వస్తువులే కాకుండా పలు సాధారణ అంశాలను కూడా కవులు కవిత్వీకరించారు ఈ పుస్తకంలో. రౌతు రవి తన 'నా విశ్వాసం అభేద్యం' కవితలో 'అక్షర ప్రవాహాలను/ పాటల జలపాతాలను సృష్టించి/ కొండంత విశ్వాసాన్ని/ సాహితీ వనంలో.../ సాహితీ స్రవంతులై ప్రవహింపజేస్తే.../ కాలానికి కళ్ళెం వెయ్యొచ్చు/ విప్లవ భావాల జల్లులు కురిపించవచ్చు' అంటూ ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తాడు. ఖమ్మం కవుల నిబద్ధతను ఈ పంక్తులు మనకు తెలియజేస్తాయి.

ఈ సంకలనంలో వర్ధమాన కవులు లబ్ధప్రతిష్టులైన కవులూ మాత్రమే కాదు బాల కవులు కూడా చోటుచేసుకున్నారు. అది మరో ప్రత్యేకత ఈ సంకలనానికి. మూడో తరగతి చదువుతున్న హేమశ్రీ తన 'ఇవాళ కూడా స్కూలుంది బాబూ' కవితలో 'స్కూల్ అప్పుడప్పుడే బావుంటుంది/ మా ఫ్రెండ్సందరికీ కూడా స్కూలు రోజూ బాగుండదు/ మా అమ్మమ్మ వచ్చినప్పుడో/ తాతయ్యొచ్చినప్పుడో స్కూలు అస్సలు నచ్చదు నాకు' అంటూ పెద్దలను ఆలోచనలో పడేస్తుంది. ఐదవ తరగతి చదువుతున్న సాహిర్ తన అద్దం కవితలో 'అద్దం ఉంటే తప్పు / నన్ను నేను చూసుకోలేను/ నిన్ను చూడగలిగిన నేను/ నన్నే ఎందుకు చూడలేకపోతున్నాను?' అని అడుగుతాడు. ఖమ్మం సాహిత్య వారసత్వం ఈ చిన్నారుల కవిత్వంలో ప్రతిఫలించడాన్ని పాఠకులు గమనిస్తారు. మొత్తంగా 108 కవితలున్న ఈ సంకలనం ఖమ్మం కవులు కవితా శక్తిని, భావనా శక్తిని, ప్రగతి శీలతను ప్రతిబింబిస్తుంది. అనేక మంచి కవితలు చోటుచేసుకున్న ఈ కవితా సంకలనం సాహిత్యాభిమానులు అందరూ చదువుకోదగ్గది.

- వీరప్రసాద్

గుమ్మం కవితా సంకలనం (ఖమ్మం జిల్లా కవుల సంకలనం)
సాహితీ స్రవంతి ప్రచురణ
పేజీలు: 226, వెల: రూ. 100/-, ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌజ్.





పోరుపాటలు
యశ్‌పాల్ ఉద్యమ గీతాలు
అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య
వెల : 20/-, పేజీలు : 118
ప్రతులకు :
నవోదయ బుక్‌హౌస్,
విశాలాంధ్ర,
ప్రజాశక్తి బుక్‌హౌస్‌లలో ...

విశాల సాహితి
సామాజిక చైతన్య పాటలు
బి.ఎస్. రాములు
వెల : 75/-, పేజీలు : 112
ప్రతులకు :
విశాల సాహితీ అకాడమీ
యూనివర్సిటీ ఆఫ్ సోషల్ ఫిలాసఫీ
బాగ్ అంబర్‌పేట్,
హైదరాబాద్



ఫ్రూట్ సలాడ్

కావలసిన పదార్థాలు

దానిమ్మ గింజలు	-	ఒక కప్పు
ద్రాక్షపళ్ళు	-	ఒక కప్పు
పైనాపిల్ ముక్కలు	-	ఒక కప్పు
అరటిపండు ముక్కలు	-	ఒక కప్పు
చెర్రీ పండ్లు	-	అర కప్పు
మామిడి పండు ముక్కలు	-	ఒక కప్పు
ఆపిల్ పండు ముక్కలు	-	ఒక కప్పు
కమలాతొన ముక్కలు	-	ఒక కప్పు
మిరియాలపొడి	-	అర స్పూన్
ఉప్పు	-	కొంచెం
తేనె	-	పావు కప్పు
నిమ్మ రసం	-	రెండు స్పూన్లు

తయారుచేసే పద్ధతి

ముందుగా పైన చెప్పిన పండ్లన్నింటినీ శుభ్రంచేసి చిన్నచిన్న ముక్కలుగా తరిగి ఒక పెద్ద గిన్నెలో వేసుకోవాలి. వీటిమీద మిరియాల పొడి, ఉప్పు వేసి నిమ్మరసం పిండి పైన తేనె వేసి నాలుగు గంటలపాటు ఫ్రిజ్‌లో ఉంచితే చాలు ఫ్రూట్ సలాడ్ సిద్ధం. ఇలా అయితే అన్ని రకాల పండ్లు తినవచ్చు. దీనివలన శరీరానికి కావలసిన విటమిన్లు అందుతాయి.

రుచి

దాల్ ఛాట్

కావలసిన పదార్థాలు

శనగపప్పు	-	రెండు కప్పులు
ఉల్లి తరుగు	-	ఒక కప్పు
క్యారెట్ తరుగు	-	ఒక కప్పు
టొమేటో తరుగు	-	అర కప్పు
కొత్తిమీర తరుగు	-	అర కప్పు
కరివేపాకు తరుగు	-	ఒక స్పూను
కారం	-	ఒక స్పూను
ఉప్పు	-	తగినంత
నిమ్మరసం	-	ఒక స్పూన్
నూనె	-	సరిపడా

తయారుచేసే పద్ధతి

మొదట శనగపప్పును నీటిలో పోసి ఒకపూట నానబెట్టుకోవాలి. ఆ తర్వాత పప్పులోని నీరంతా తీసెయ్యాలి. బాండీలో నూనె పోసి కాగాక నానబెట్టిన పప్పును ఎర్రగా వేయించి తీసి టిష్యు పేపర్‌మీద వేసి నూనె పోయాలి. తర్వాత దీనిని ఒక పెద్ద గిన్నెలోకి తీసుకుని పైన చెప్పిన తరుగులన్నీ వేసి ఉప్పు, కారం చల్లి నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఇది చాలా రుచిగా వుంటుంది.

- పి.జ్యోతి



యాసలపు సూర్యారావు

అనంతగిరిలో వీరయ్య, సూరయ్య, రంగయ్య అనే ముగ్గురు పేద రైతులు ఉన్నారు. వారిలో వీరయ్య కొన్నేళ్ల క్రితం ఒక ఖాళీ స్థలంలో తనకు ఎవరో ఇచ్చిన చిన్న మామిడి మొక్కను పాతి వెళ్లిపోయాడు. తనకంటూ సొంత ఇల్లూ, స్థలం లేని కారణంగా అక్కడ పాతి, వెళ్లిపోయాడు. అప్పటి నుండి దాని గురించి పట్టించుకోలేదు.

అక్కడకు దగ్గర్లోనే వుంటున్న సూరయ్య ఆ మామిడి మొక్కను చూసి, 'ఎవరు పాతారో గానీ మామిడి మొక్క పెద్దదైతే పది మందికీ ఉపయోగపడుతుంది' అనుకుని పశువులు తినేయకుండా దాని చుట్టూ కంచె వేశాడు. రోజూ దానికి నీళ్లు పోసి పెంచాడు.

ఆ విధంగా కొద్ది సంవత్సరాలకు మామిడి మొక్క కాస్తా చెట్టు అయింది. పూత పూసి కాపుకొచ్చింది. చెట్టంతా నిండుగా మామిడి కాయలతో కళకళలాడుతూ ఉంది. ఇదంతా గమనించిన వీరయ్య ఒక రోజున వచ్చి "ఈ చెట్టు నాది. దీని కాయలు ఎవ్వరూ కోయకూడదు" అన్నాడు. అందుకు సూరయ్య "ఈ చెట్టు నీది కాదు. దీన్ని పెంచింది, పెద్ద చేసింది నేను. ఈ చెట్టు కాయలు నాకే చెందుతాయి" అన్నాడు.

ఇంతలో స్థలం సొంతదారుడు రంగయ్య అక్కడకు వచ్చి, "ఈ స్థలం నా సొంతం. కాబట్టి నా స్థలంలో వున్న చెట్టు నాకే చెందుతుంది" అన్నాడు. మధ్యలో సూరయ్య కలుగజేసుకొని, "నేల నీదైనా... మొక్క నాటింది నువ్వైనా... దాన్ని మొక్కగా వున్నప్పటి నుండీ జాగ్రత్తగా చూసుకుంది నేను. దాన్ని పశువులు తినకుండా చుట్టూ కంచె వేసి, రోజూ నీళ్లు పోశాను. అది చెట్టయ్యేంత వరకు కష్టపడింది నేను. కాబట్టి ఈ చెట్టు ఫలసాయం నాకే దక్కుతుంది" అన్నాడు. ఈ విధంగా వాగ్వివాదం పెరిగి పెద్దదై కొట్టుకునేదాకా వచ్చారు.

ఈ తరుణంలో ఇరుగుపొరుగు వాళ్లు కలగచేసుకుని "అబ్బాయిలూ... మీరు కొట్టుకోవడం దేనికి? తిన్నగా పోయి మీ తగువును రాజుగారికి విన్నవించుకోండి. ఆయనే ఈ చెట్టు ఎవరికి చెందుతుందో చెప్తారు" అన్నారు. రాజుగారు ఇచ్చిన తీర్పును శిరసావహించి దానికి అనుగుణంగా నడుచుకోవాలని ముగ్గురూ తీర్మానించుకున్నారు. ముగ్గురూ రాజు విజయసేనుడి దర్బారుకు వెళ్లి తమ తగువును విన్నవించుకున్నారు. పైగా రాజుగారికి తమ వాదన వినిపించారు.

వీరి ముగ్గురి వాదన విన్న తరువాత రాజుగారు సుదీర్ఘంగా ఆలోచించి, ఒక నిర్ణయానికొచ్చాడు. మహామంత్రిని పిలిచి, "వీరు ముగ్గురూ ఆ చెట్టు తమకే చెందాలని అంటున్నారు. కాబట్టి వివాదానికి కారణమైన ఆ చెట్టును నరికేయండి" అన్నాడు. దానికి వీరయ్య, రంగయ్య 'అలాగే చెయ్యండి' అన్నారు.

కానీ సూరయ్య మాత్రం "మహారాజా! ఆ చెట్టును నరకవద్దు. నాకు దక్కకపోతే పోయింది. పదిమందికీ నీడనూ, ఫలాలను ఇచ్చే చెట్టును నరకొద్దు. వాళ్లిద్దరినే ఆ ఫలసాయాన్ని అనుభవించనివ్వండి ప్రభూ!" అన్నాడు. ప్రాధేయపూర్వకంగా.

సూరయ్యలోని విజ్ఞతనూ, చెట్టుమీద అతనికున్న మమకారాన్ని రాజు గుర్తించాడు. "సూరయ్యా! ఇకమీదట ఆ చెట్టు, దానిమీద వచ్చే ఫలసాయం నీదే. సంపూర్ణంగా అనుభవించు. మీరిద్దరూ సూరయ్యపైగానీ, అతని చెట్టుపైగానీ చెయ్యి వేస్తే కఠినంగా శిక్షిస్తాను. ఇక వెళ్లండి" అన్నారు రాజుగారు. రాజుగారి తీర్పు విని సభికులంతా హర్షధ్వానాలు చేశారు.